
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 23 | ది. 20-3-2025 | విజయవాడ | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/-




అసెంబ్లీలో బీసీ బిల్ ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి ఓబీసీ డిపార్ట్మెంట్ తరఫున కృతజ్ఞతలు చెపుతున్న బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతిశ్రీకాంత్ గౌడ్, టిపిసిసి ఓబిసి సెల్ ప్రధాన కార్యదర్శి గొంటి విక్రమ్ యాదవ్,ఓబీసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ దేశ బోయిన రవికుమార్
–హైదరాబాద్,మార్చి 19 (వార్తాప్రభ) :

# సంక్షేమానికి భారీగా కేటాయింపులు

- ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు
- ఎస్టీ సంక్షేమం : రూ.17,169 కోట్లు
- బీసీ సంక్షేమానికి ఈసారి రూ.11,405 కోట్లు
- మైనార్టీ సంక్షేమానికి రూ.3,591 కోట్లు
- బడ్జెట్‌లోనే అత్యధిక కేటాయింపులు
- రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి భారీగా కేటాయింపులు



**హైదరాబాద్, మార్చి 19 (వార్తాప్రభ) :** రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి భారీగా కేటాయింపులు చేశారు. ఈ నాలుగింటికి కలిపి రూ.72,397 కోట్లను కేటాయించారు. వీటిలో ఎస్సీ సంక్షేమానికి అత్యధిక కేటాయింపులు చేశారు. ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు కేటాయించగా, ఎస్టీ సంక్షేమానికి రూ.17,169 కోట్లు, ఆ తర్వాత బీసీ సంక్షేమానికి రూ.11,405 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.3,591 కోట్లను కేటాయిస్తూ పద్దును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం, సమానాభివృద్ధి పట్ల నిబద్ధతను నిలుపుకునేలా ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం తీసుకొచ్చాం. దీంతో వారి జీవితాల్లో మార్పు వస్తుంది. జస్టిస్? షమీమ్ అక్తర్? నేతృత్వంలో ప్రత్యేక విచారణ కమిషన్? ఏర్పాటు చేసి ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై నివేదికను ఇచ్చారు. ఇందులో 59 ఎస్సీ ఉపకులాలను వారి సామాజిక, ఆర్థిక వెనుబడిన స్థాయిల ప్రకారం మూడు వర్గాలుగా విభజించారు. దీంతో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. గిరిజనాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ఇందిరా గిరి జలవికాసం అనే ప్రత్యేక పథకంతో పోడు భూములు సాగు చేసుకునే గిరిజన రైతులకు సౌర ఆధారిత పంపుసెట్ల ద్వారా సాగునీటిని అందిస్తామని భట్టి ప్రకటించారు. ఇందుకు వచ్చే నాలుగేళ్లలో రూ.12,600 కోట్లు కేటాయించారు. దీంతో 2.1 లక్షల గిరిజన రైతులకు లబ్ధి చేకూరుతుందని బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ సబ్? ప్లాన్? చట్టం ప్రకారం ఖర్చు చేయాల్సిన నిధులలో ఎస్సీ, ఎస్టీలకు రూ.13,617 కోట్లు, రూ.1,317 కోట్లు ఖర్చు చేయకుండా బకాయి పెట్టారు. కానీ 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేటాయించాల్సిన మొత్తానికి అదనంగా 2023.24కి సంబంధించిన బకాయిలను కేటాయిస్తారు. బీసీ సంక్షేమానికి ఈసారి రూ.11,405 కోట్లు కేటాయించినట్లు బడ్జెట్ ప్రసంగంలో భట్టి విక్రమార్క తెలిపారు. వీటిలో ఎక్కువగా వెనకబడిన కులాల పథకాలకే ఇచ్చినట్లు ప్రకటించారు.



**మైనార్టీ సంక్షేమానికి రూ.3,591 కోట్లు :** రాష్ట్రంలో మైనార్టీల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. యంగ్? ఇండియా రెసిడెన్షియల్? స్కూల్?లలో వివిధ ప్రాంతాలలో ఉన్న మైనారిటీ రెసిడెన్షియల్? స్కూల్? కూడా అంతర్భాగం చేయటం ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఇతర విద్యార్థులతో పాటు అత్యుత్తమ విద్యను అందించవచ్చని భరోసా ఇచ్చారు. వీటితో పాటు ముస్లిం సోదరుల అతి పవిత్రంగా భావించే హజ్? యాత్రకు తగినన్ని నిధులు కేటాయించినట్లు తెలిపారు. మొత్తంగా మైనార్టీల అభివృద్ధికి రూ.3591 కోట్లు కేటాయించారు. వీటితో పాటు రాజీవ్? యువ వికాసం మైనారిటీ సోదర, సోదరీమణులకు రూ.840 కోట్లతో స్వయం ఉపాధి పథకాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు..

# ఢిల్లీలో బిల్ గేట్స్ తో ఏపీ సిఎం చంద్రబాబు భేటీ

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - గేట్స్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం
- ఆరోగ్య, వ్యవసాయ, విద్య రంగాల్లో టెక్నాలజీ వినియోగంపై గేట్స్ ఫౌండేషన్ తో ఒప్పందం
- బిల్ గేట్స్ ను రాష్ట్రానికి ఆహ్వానించి ముఖ్యమంత్రి చంద్రబాబు





**న్యూఢిల్లీ,మార్చి 19 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్ తో ఒప్పందం చేసుకుంది. పరిపాలనతో పాటు వివిధ శాఖల్లో టెక్నాలజీ ఆధారిత కార్యక్రమాలను అమలు చేయడానికి అవగాహన ఒప్పందం చేసుకుంది. ఆరోగ్య సంరక్షణ, మెడ్‌టెక్, విద్య, వ్యవసాయ రంగాల్లో ఖర్చు తగ్గింపు, ఉపాధి కల్పన వంటి రంగాల్లో విస్తృత స్థాయిలో ప్రయోజనాలు అందించే విధానాలను అభివృద్ధి చేసే అంశాలపై ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాల్లో కొత్త ఆవిష్కరణలను అందించడానికి సంయుక్తంగా పనిచేయనున్నారు. ఆరోగ్య రంగంలో AI ఆధారిత టెక్నాలజీ ద్వారా ప్రిడిక్టివ్ అనలిటిక్స్, ఆటోమేటెడ్ డయాగ్నోస్టిక్స్ విభాగాల్లో గేట్స్ ఫౌడేషన్ సహకారం అందించనుంది. అదే విధంగా వ్యవసాయ రంగంలో AI ఆధారిత కార్యక్రమాలకు, సాగు నిర్వహణలో శాటిలైట్ ఆధారిత వ్యవస్థలను ప్రవేశపెట్టనున్నారు. అదే కొత్త ఆవిష్కరణల ద్వారా ఉపాధి కల్పన అవకాశాలను మెరుగుపరచనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, "గేట్స్ ఫౌండేషన్ మద్దతుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. టెక్నాలజీ ఆధారిత పరిపాలన, మానవ వనరుల అభివృద్ధి, ఆరోగ్యం, వ్యవసాయం, విద్య రంగాల్లో వినూత్న పరిష్కారాలను చూపేందుకు ఈ ఒప్పందం ఎంతో దోహదపడుతుంది" అని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిందిగా బిల్ గేట్స్ ను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఈ ఒప్పందం ద్వారా డేటా ఆధారిత అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపుతున్న చొరవ, సంకల్పాన్ని గేట్స్ ఫౌండేషన్ చైర్మెన్ బిల్ గేట్స్ ప్రశంసించారు. "ఈ ఒప్పందం ద్వారా తక్కువ ధర కు, సులభంగా లభ్యమయ్యే, స్థానికంగా తయారు చేసే వైద్య పరికరాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చని, తద్వారా ప్రజల జీవితాలను మార్చవచ్చని అన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య రంగాల్లో AI, టెక్నాలజీ వినియోగం ద్వారా అందరికీ ఆదర్శంగా నిలవచ్చు " అని అన్నారు. ఢిల్లీలోని హోటల్ లో జరిగిన ఈ సమావేశంలో గేట్స్ ఫౌడేషన్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఐటీ శాఖ సెక్రటరీ కాటంనేని భాస్కర్ గేట్స్ ఫౌడేషన్ తో ఎంవోయులో పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రులు పెమ్మసాని, శ్రీనివాస వర్మ, ఎంపి శ్రీకృష్ణ దేవరాయులు, సిఎంవో అధికారులు పాల్గొన్నారు.

# సజ్జలకు జగన్ వార్నింగ్.. సాయి రెడ్డి ఎఫెక్ట్..?





**విజయవాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** వైసీపీ ప్రస్తుత ఉన్న పరిస్థితికి కారణం వైయస్ జగన్ తో పాటుగా సజ్జల రామకృష్ణారెడ్డి అనేది రాజకీయ వర్గాల్లో ఉన్న అభిప్రాయం. 2019లో 151 స్థానాలతో అత్యంత ఘనవిజయం సాధించిన పార్టీ.. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం కావడాన్ని వైసిపి కార్యకర్తలు అసలు జీర్ణించుకోవడం లేదు. అటు వైసీపీ నేతలకు కూడా ఈ ఓటమి ఇంకా మింగుడు పడటం లేదని చెప్పాలి. 2010 నుంచి కష్టపడి 2019లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన వైయస్ జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, మాట్లాడిన మాటలు వైసీపీని బాగా ఇబ్బంది పెట్టాయి. దానికి తోడు పార్టీ నేతలు కూడా ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం.. పార్టీని మరింత ఇబ్బందులకు గురిచేసిందని చెప్పాలి. ఇంకా పార్టీ నేతలను జగన్ కు దూరం చేయడం కూడా వైసిపి పతనానికి కారణమనే అభిప్రాయాలు చాలామంది నుంచి వినిపించాయి. ముఖ్యంగా వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. వైయస్ జగన్ కు పార్టీ కార్యకర్తలకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ.. జగన్ ను కార్యకర్తలకు, పార్టీ నాయకులకు దూరం చేశారనే అభిప్రాయాలు అప్పట్లో చాలా వరకు వైసిపి నేతల నుంచే వినిపించాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ఏం చేయాలన్నా సరే సజ్జల రామకృష్ణారెడ్డి అనుమతి ఉండాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు అప్పట్లో. ఇక వైసిపి సోషల్ మీడియా కూడా విజయసాయిరెడ్డి నుంచి సజ్జల రామకృష్ణారెడ్డి లాక్కున్నారు. వైసీపీలో రామకృష్ణారెడ్డి ఆయన కుమారుడు భార్గవ్ రెడ్డి పెత్తనమే ఎక్కువగా కనపడింది. దీనితో విజయసాయిరెడ్డి విసిగిపోయి జగన్ కు దూరమయ్యారు. సాయిరెడ్డి రాజకీయాల నుంచి తప్పుకోవడానికి ప్రధాన కారణం అదే. ఈ విషయాన్ని స్వయంగా విజయ సాయి రెడ్డి వెల్లడించారు. అయితే ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి విషయంలో వైయస్ జగన్ జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలకు రామకృష్ణారెడ్డిని దూరంగా ఉంచాలని జగన్ భావిస్తున్నారట. పార్టీ నేతలతో కూడా ఎటువంటి సమావేశాలు నిర్వహించొద్దని... పార్టీ నేతలతో కూడా టచ్ లో ఉండవద్దని సజ్జల రామకృష్ణారెడ్డికి... జగన్ స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. గతంలో ఆయన సాక్షిలో కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు కూడా సాక్షికి పరిమితం కావాలని జగన్ చెప్పినట్లు సమాచారం. సాక్షిలో ఎడిటర్ గా సజ్జల వైసీపీ అనుకూలంగా ఎన్నో కథనాలు రాసేవారు. పార్టీ ప్రజల్లోకి వెళ్ళడానికి ఇది బాగా ఉపయోగపడేది. ఇప్పుడు దానికి మాత్రమే ఆయన పరిమితం కావాలని.. కొన్నాళ్లపాటు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటే మంచిది అని జగన్ సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. అలాగే తాడేపల్లి నివాసంలో కూడా సజ్జల రామకృష్ణారెడ్డి ఉండకూడదు అని జగన్ చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. విజయసాయిరెడ్డి వ్యవహారంతో కంగుతిన్న వైయస్ జగన్.. మరిన్ని ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రామకృష్ణారెడ్డిని దూరంగా పెడుతున్నట్లు సమాచారం.

# చేయూచేయూ కలుపుదాం.. పర్యాటకులకు ఆత్మీయ ఆతిథ్యమిద్దాం..

- సేవా రంగ వృద్ధి ఉమ్మడి లక్ష్యానికి సమష్టిగా కృషిచేద్దాం
- గ్రోత్ ఇంజిన్‌గా వాణిజ్యం, హెూటళ్లు, రెస్టారెంట్స్ విభాగం
- పర్యాటకులకు మధురానుభూతి మిగిల్చేలా టూరిజం ప్యాకేజీలు
- స్వర్ణాంధ్ర ఏ 2047, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర దిశగా వడివడిగా అడుగులు
- సీసీఎల్‌ఏ, జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు





**విజయవాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా స్వర్ణాంధ్ర ఏ 2047, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రణాళిక ప్రకారం కృషిచేయడం జరుగుతోందని.. ఇందులో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లాలో భాగస్వామ్య పక్షాల సమష్టి కృషితో ఆతిథ్య రంగంతో సహా సేవారంగ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు సీసీఎల్‌ఏ, జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. బుధవారం విజయవాడలోని హెూటల్ హయత్ ప్లేస్‌లో స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ (ఎస్‌జీఎల్ఆర్), స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, పీ4 విధానం, టూరిజం సహా సేవా రంగ అభివృద్ధిపై ఛాంబర్ ఆఫ్ కామర్స్, హెూటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రత్యేక అధికారి జయలక్ష్మి మాట్లాడుతూ పర్యాటకులకు ఎప్పటికీ గుర్తుండిపోయేలా మౌలిక వసతులతో ఆతిథ్యమివ్వాల్సిన అవసరముందన్నారు. హెూటళ్లు కూడా రిసెప్షన్, చెక్ ఇన్, చెక్ అవుట్ సహా అన్ని విభాగాలనూ పర్యాటక మిత్ర విభాగాలుగా తీర్చిదిద్దుకోవాలని.. పర్యాటకంలో జిల్లాల మధ్య పోటీతత్వం, సమన్వయం కూడా అవసరమన్నారు. విజయవాడ సౌందర్యాన్ని, ఆతిథ్య ఔన్నత్యాన్ని ప్రతిబింబించేలా ట్యాగ్‌లైన్ రూపకల్పనకు కృషిచేసి.. ఇమేజ్‌ను నిలబెట్టేందుకు కృషిచేయాలన్నారు.

**ఉమ్మడి లక్ష్యాల సాధనకు సమష్టి కృషి అవసరం: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ..** కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ 2047, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకొని, ఉమ్మడి లక్ష్యాల సాధనకు వివిధ పక్షాల భాగస్వామ్యాన్ని ప్రోది చేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా ఆర్థిక వ్యవస్థలో 66 శాతం సేవారంగం వాటా ఉందని.. ఇంతటి ప్రాధాన్యమున్న రంగంలోని వాణిజ్యం, హెూటళ్లు, రెస్టారెంట్ల ఉప రంగంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో 22.22 శాతం వృద్ధి లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం జరిగిందని వివరించారు. అదేవిధంగా నవ్య రాజధాని అమరావతికి గేట్‌వే అయిన విజయవాడతో పాటు ఎన్‌టీఆర్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో టెంపుల్ టూరిజంతో పాటు ఎకో, హిస్టారికల్ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించినట్లు తెలిపారు. యువతను గైడ్లుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ హిత స్వచ్ఛత, పారిశుద్ధ్యంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ పర్యాటకులకు మధురానుభూతులు మిగిల్చే హెూటళ్లు, లాడ్జిలు వంటివాటికి ప్రభుత్వం గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వనుందని.. స్థానిక సమాజం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుత పర్యాటకంలో భాగంగా ఆతిథ్య రంగంలో సురక్షిత పారిశుద్ధ్య నిర్వహణను ప్రోత్సహించేందుకు ఈ గ్రీన్ లీఫ్ రేటింగ్ వ్యవస్థను ఆవిష్కరించినట్లు వివరించారు. హెూటళ్లు, లాడ్జీలు, హెూమ్‌స్టేలు, ధర్మస్థలాలు తదితర ఆతిథ్య సౌకర్యాలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని..ఇందుకు మండల, డివిజన్, జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటైనట్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ నగరంలో రాత్రి 12 గంటల వరకు హెూటళ్లను తెరచి ఉంచుకునే విధంగా ఇప్పటి నుంచి మూడు నెలలపాటు అమలు చేసి తర్వాత పరిస్థితిని విశ్లేషించి పొడిగింపుపై తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. విజయవాడ నగరం అద్భుత నగరమని,ఇక్కడకు వచ్చే పర్యాటకులకు శాంతియుత వాతావరణం, భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్స్ వినియోగం వంటి అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 3,500 సీసీ కెమెరాలను వినియోగిస్తున్నామని.. ఇలాంటి చర్యల వల్ల క్రైమ్ డిటెక్షన్ సులభతరమవుతుందన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కు పాదం మోపేందుకు నిఘాను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం మాట్లాడుతూ మూడు కాలువలు, కృష్ణా నదితో నగరం సుందర నగరంగా భాసిల్లుతోందని.. ఇంతటి విశిష్ట నగరాన్ని స్వచ్ఛతతో పాటు అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపుతున్నట్లు తెలిపారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లోనూ ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడ ముందు వరుసలో ఉంటోందని ఈ ఏడాది కూడా ఉత్తమ స్థానంలో నిలిపేందుకు అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ హెూటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్ వీరాస్వామి, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కర్, విజయవాడ హెూటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమణ, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్, హెూటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

# అభద్రత భావానికి గురి అవుతున్న జర్నలిస్టులు

- జర్నలిస్టుల సంక్షేమ పథకాలు తక్షణం పునర్ధరించాలి
- దివంగత జర్నలిస్టులు "నేతాజీ"శర్మ, విజయ్, బాలు లకు ఘన నివాళి



**విజయవాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** సమాజ సంక్షేమే ధ్యేయంగా పనిచేస్తున్న జర్నలిస్టులు కనీస ఆదాయాలు, కనీస ప్రభుత్వ ప్రోత్సాహం లేక తీవ్ర ఆబద్రత భావానికి గురి అయ్యి, ఆరోగ్యాలను దెబ్బతీసుకుంటున్నారని ఆంధ్ర ప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీ రామ్ యాదవ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సంపాదకుల సంఘం అధ్యక్షులు కే ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్య సమస్యలతో గుండెపోటు గురై మరణించిన నేతాజీ శర్మ, హేలాపు విజయ్, జర్నలిస్ట్ బాలు లకు పలువురు జర్నలిస్ట్ లు ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఎంపనెల్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎన్.ప్రసాద్, జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేణు, అక్కిరెడ్డిపల్లి రామ్మోహన్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభం గా గొప్పగా చెప్పుకుంటున్న పత్రిక వ్యవస్థ, అందులో పని చేస్తున్న పాత్రికేయులు 80 శాతము పైగా తీవ్ర ఇబ్బందుల మధ్య వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేందుకు, అదే విధంగా ప్రజా సమస్యలు మీడియా వ్యవస్థ ద్వారా తెలుసుకొని ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నావే తప్ప ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటున్న పాత్రికేయుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. 6 కోట్ల ప్రజల సంక్షేమం కోసం అనుక్షణం జీవోలు విడుదల చేసే ప్రభుత్వాలు, 40 వేల మంది లోపు ఉన్న జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏ ఒక్క జి. ఓ.ను ఏ ప్రభుత్వం కూడా సక్రమంగా, సమయానికి విడుదల చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 అక్రిడేషన్ జీవోను తక్షణమే విడుదల చేయాలని, గత చంద్రబాబు నాయుడు హయాంలో అమలులో ఉన్న అన్ని జర్నలిస్టుల సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం తక్షణమే పునర్ధించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యేమినేని వెంకటరమణ, నగర అధ్యక్షులు తాళ్లూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తైబజార్ వేలం పాటలో టెండర్ దక్కించుకున్న కొత్తకొండ వేణు



**జవహర్ నగర్, మార్చి,19:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ తైబజార్ వేలం పాట 2025 -2026 ఆర్థిక సంవత్సరానికితేదీ 01-04-2025 నుండి 31-03-2026 కాలపరిమితికి నిర్వహించడం జరిగింది. ఈ వేలంపాటలో అత్యధిక ధర పాడికొత్తకొండ వేణు టెండర్ దక్కించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ వసంత వెల్లడించారు.వేలంపాట అనంతరం కమిషనర్ వసంత, మరియు మునిసిపల్ కార్పొరేషన్ మేనేజర్, ఆర్ ఓ, నూతన కాంట్రాక్టర్ కొత్తకొండ వేణుకు అభినందనలు తెలిపారు.కమిషనర్ కి మేనేజర్ కి ఆర్వోకి ధన్యవాదాలు తెలియజేసిన నూతన టెండర్ దారు (కాంట్రాక్టర్ )కొత్తకొండ వేణు, ఈ సందర్భంగా స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రమాదకర "మ్యాన్ హెూల్స్"పై దృష్టి సారించండి!!

***పిచ్చి మొక్కలను తొలగించి సరిచేయండి***
***జిల్లా అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ***



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 19 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరపాలక సంస్థలో వివిధ డివిజన్ల పరిధిలో ఉన్నటువంటి ప్రమాదకర "మ్యాన్ హెూల్స్"పై దృష్టి సారించండి అని సంబంధిత అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జే.అరుణశ్రీ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం 11వ డివిజనులో పర్యటించి మ్యాన్ హెూల్స్ పరిశీలించారు అదనపు కలెక్టర్. చుట్టూ పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించి పైకప్పులను సరిచేయాలి అని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

## గుండె గణేష్ ముదిరాజ్ మరింతగా ఎదగాలి.

***జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన బిజెపి ఇంచార్జ్ రవికుమార్ యాదవ్***



**శేరిలింగంపల్లి,మార్చి 19 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ కు చెందిన బిజెపి సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు రవి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ శాలువా కప్పి,కేక్ కట్ చేసి గణేష్ ముదిరాజ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ముందు ముందు మరెన్నో వేడుకలు జరుపుకొని జీవితంలో,రాజకీయాల్లో పైకి రావాలని రవికుమార్ యాదవ్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్,కొంచె శివరాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్ బడిలో శ్రీమంతం!!

***గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి***
***వేసవికాలం నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటించాలి***
***అంగన్వాడి టీచర్ రజిత***



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 19 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగర పాలక సంస్థ 39వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ వన్ అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని బుధవారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ రజిత గర్భిణీ స్త్రీలకు పలు సూచనలను చేశారు. గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి అని తెలిపారు. వేసవికాలం నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత ముర్రు పాలు, తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మమత, అంగన్వాడీ ఆయా అరుణ, ఆశా వర్కర్ మమత పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణ పోలీస్ ప్రథమ కర్తవ్యం!!

- పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వర్తించాలి
- వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- క్రమశిక్షణతో విధుల్లో ముందుకు సాగాలి
- రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 19 (వార్తాప్రభ ప్రతినిధి)** శాంతి భద్రతల పరిరక్షణ పోలీస్ ప్రథమ కర్తవ్యం అని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ సిబ్బందికి, అధికారులకు సీపీ పలు సూచనలను చేశారు. పోలీస్ శాఖ ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వర్తించాలి అని సూచించారు. సమాజ పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రజలతో మమేకవుతూ, క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, హెూంగార్డ్స్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా దర్బార్ నిర్వహణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ, ఏఆర్ ఏసిపి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## టెన్షన్ పక్కనపెట్టి ఎగ్జామ్స్ రాయాలి!!

- భవిష్యత్తు దృష్టితో అధిక జీపీఏ సాధించాలి
- ప్రతి క్వశ్చన్ ఒకటికి రెండుసార్లు చదివి ఆన్సర్ చేయాలి
- చక్కటి ఆహారం, సరిపడ తాగునీరు తీసుకోవాలి
- అనవసర ఆలోచనలతో అనారోగ్యానికి గురి కావద్దు
- సింగరేణి ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 19 (వార్తాప్రభ ప్రతినిధి)**టెన్షన్ పక్కనపెట్టి ఎగ్జామ్స్ రాయాలి అని సింగరేణి పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు సింగరేణి ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్ సూచనలను చేశారు. ఈ మేరకు బుధవారం సింగరేణి హై స్కూల్ సెక్టార్ 2 పాఠశాల లోని పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం హాజరై హాల్ టికెట్లు ప్రధానం చేసి విద్యార్థులకు సూచనలు చేశారు. భవిష్యత్తు దృష్టితో అధిక జీపీఏ సాధించాలి అని అన్నారు. ప్రతి క్వశ్చన్ ఒకటికి రెండుసార్లు చదివి ఆన్సర్ చేయాలి అని తెలిపారు. చక్కటి ఆహారం, సరిపడ తాగునీరు తీసుకోవాలి అని, పరీక్షల సమయంలో అనవసర ఆలోచనలతో అనారోగ్యానికి గురి కావద్దు అని తెలిపారు. తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దేవరకొండ కిరణ్ బాబు, ప్రధాన ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, అధ్యాపకులు స్వర్ణలత, శశికళ, శ్రీలత, సుజాత, శోభారాణి, పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కరువుకు రైతన్నల విలవిల!!

- గోదావరిని ఎండగొట్టడమే ప్రజా పాలననా?
- సాగునీరు అందించక చేతులు దులుపుకుంటారా?
- కెసిఆర్ పాలనలో కరువు కనుమరుగయింది
- రేవంత్ పాలనలో కరువు తాండవిస్తున్నది
- రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 19 (వార్తాప్రభ ప్రతినిధి)**కాంగ్రెస్ కరువుకు రైతన్నలు విలవిల లాడుతున్నరు అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్. గోదావరి గోస పేరిట చేపట్టిన మహా పాదయాత్ర బుధవారం మూడవ రోజు కరీంనగర్ నుంచి బయలుదేరినది. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు చందర్. గోదావరిని ఎండగొట్టడమే ప్రజా పాలననా? అని మీడియా సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యవసాయానికి సాగునీరు అందించక చేతులు దులుపుకుంటారా? అని అడిగారు. కెసిఆర్ పాలనలో కరువు కనుమరుగయింది అని తెలంగాణ రాష్ట్రం ప్రజలు సుభిక్షంగా వర్ధిల్లారని సంతోషం వ్యక్తం చేశారు. మరి నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ పాలనలో కరువు తాండవిస్తున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా రివర్స్ పంపింగ్ ద్వారా చెక్ డ్యాంలను అన్నింటిని నింపాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## "వికసిత్ భారత్"కి 150 మంది ఎంపిక!!

- "యూత్ పార్లమెంట్"కి విశేష స్పందన
- స్క్రూట్నీ ద్వారా 23 మంది రిజెక్ట్
- 21, 22వ తేదీలలో "వన్ నేషన్ వన్ ఎలక్షన్" కాంపిటీషన్
- రెండు రోజులపాటు భోజన వసతి, సర్టిఫికెట్లు అందిస్తాం ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా
- నోడల్ ఆఫీసర్ డాక్టర్ సాంబశివరావు





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 19 (వార్తాప్రభ ప్రతినిధి)** "వికసిత్ భారత్"కి 150 మంది ఎంపిక చేసినట్లు వివరాలను గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జై కిషన్ ఓజా వెల్లడించారు. "యూత్ పార్లమెంట్"కి విశేష స్పందన లభించింది అని 173 మంది ఒక నిమిషం నిడివి గల వీడియోలను పంపించారని, స్క్రూట్నీ ద్వారా 23 మందిని రిజెక్ట్ చేసినట్లు వివరాలు తెలిపారు. నోడల్ స్థాయి జిల్లా పోటీలు 21, 22 తేదీలలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పేవింగ్ థి వే ఫర్ భారత్ అనే అంశం మీద ప్రతి విద్యార్థి మాట్లాడతారని తెలిపారు. ఐదుగురు జడ్జీలు, న్యాయ నిర్ణీతలు మొత్తం వంద మార్కులకు పాయింట్స్ ఇస్తారని తెలిపారు. పోటీలలో పాల్గొనే వారందరికీ రెండు రోజులపాటు భోజన వసతి, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వనున్నట్లు నోడల్ ఆఫీసర్ సాంబశివరావు తెలిపారు. విజేతలను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

# వార్తా ప్రభ

# హైదరాబాద్

## అన్ని వర్గాలను అక్కున చేర్చుకుంటున్న కాంగ్రెస్!!

- బీసీ, ఎస్సీ రిజర్వేషన్ బిల్ ఆమోదం హర్షనీయం
- రిజర్వేషన్ ప్రక్రియతో లబ్ధిదారులకు బంగారు భవిష్యత్తు
- గోదావరిఖని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 19 (వార్తాప్రభ ప్రతినిధి)**అన్ని వర్గాలను అక్కున చేర్చుకుంటున్న కాంగ్రెస్ మనసున్న ప్రభుత్వమని గోదావరిఖని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ, ఎస్సీ రిజర్వేషన్ బిల్ శాసనసభలో ఆమోదం కావడం పట్ల సంబరాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ..... శాసనసభలో బీసీ, ఎస్సీ రిజర్వేషన్ బిల్ ఆమోదం హర్షనీయం అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషికి గుర్తింపు అని అన్నారు. రిజర్వేషన్ ప్రక్రియతో లబ్ధిదారులకు విద్య, ఉద్యోగ అవకాశాలతో బంగారు భవిష్యత్తు లభిస్తుంది అని హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలలో కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**నాగారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి**



**కీసర, నాగారం, మార్చి,19:(వార్తా ప్రభ )**మహిళలు నాగారంలో ఈ నెల మార్చి 23న నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని నాగారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మల్టీ నేషనల్ కంపెనీలో పదవ తరగతి ఉత్తీర్ణులైన మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.కొంగరకలాన్‌లో ఫాక్స్ కాన్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని ఆయన వివరించారు. నిరుద్యోగ మహిళలను దృష్టిలో ఉంచుకుని ఈనెల మార్చి మార్చి 23న నాగారంలోని ఎంవైఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బ్లూ ఓషియన్, ఆదాబ్ హైదరాబాద్ దినపత్రిక సంయుక్తంగా మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హత ఉన్న నిరుద్యోగ యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎంపికైన మహిళలకు ప్రతి నెల రూ.14,500 నుండి రూ.16,500 వరకు జీతం ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు కంపెనీ వద్దకు ఏసీ బస్సులో రావడం, పోవడంతో పాటు టీ, టిఫిన్, భోజనం వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు. పదవ తరగతి, ఐటిఐ, డిప్లమా పూర్తి చేసిన అభ్యర్థులు, ఇంటర్మీడియట్, డిగ్రీ ఫెయిల్ అయిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆదివారం నిర్వహిస్తున్న జాబ్ మేళాకు హాజరై నిరుద్యోగ యువతులు, మహిళలు పదవ తరగతి మెమో, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

## ఎన్టీటీపీఎస్ కోల్ ప్లాంట్ లో అగ్నిప్రమాదం

***- రెండు కన్వేయర్లు, కౌంటర్ వెయిట్ పుల్లీలు, కేబుల్స్, తదితర సామగ్రి అగ్నికి ఆహుతి***
***ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఏపీ జెన్ కో డైరెక్టర్లు, ఎన్టీటీపీఎస్ అధికారులు***



**ఇబ్రహీంపట్నం, మార్చి 19(వార్తా ప్రభ ప్రతినిధి):** డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. స్టేజ్ - 1 అండ్ 2 కోల్ ప్లాంట్ లో నిప్పులు చెలరేగి కన్వేయర్ బెల్ట్ - 4ఏ2 టైల్ ఎన్డ్ టు హెడ్ ఎన్డ్ జంక్షన్ టవర్ 9 సీహెచ్ పీ వరకు మంటలు భారీగా ఎగసిపడి పూర్తిగా దగ్ధమైంది. రెండు కన్వేయర్లు, కౌంటర్ వెయిట్ పుల్లీలు, కేబుల్స్ తదితర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. రూ.కోట్లలో ఆస్తినష్టం జరిగినట్లు తెలుస్తోంది. రాత్రి 11 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. కన్వేయర్ 4ఏ2 స్టేజ్ - 1 యూనిట్లకు బొగ్గును అందిస్తూ మంటలను గమనించిన సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఏపీ జెన్ కో డైరెక్టర్లు, ఎన్టీటీపీఎస్ అధికారులు బుధవారం ఉదయం ప్రమాదం జరిగిన కోల్ ప్లాంట్ ను పరిశీలించారు. నష్టం అంచనాలు వేస్తున్నారు. అగ్నిమాపక దళం క్లియరెన్స్ తరువాత బెల్ట్ మరమ్మతులు ప్రారంభించారు. ప్రత్యామ్నాయ మార్గంలో స్టేజ్ - 1 యూనిట్లకు సరిపడా బొగ్గు సరఫరా చేస్తున్నారు.

**పర్యవేక్షణ లోపం వల్లే ప్రమాదం** ఎన్టీటీపీఎస్ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లే ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గతంలో స్టేజ్ - 3లో 13 ఏ/బీ కన్వేయర్ బెల్ట్ ఇలాగే దగ్ధమైంది. ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు గుణపాఠం నేర్వడం లేదు.

# ఎడిటోరియల్

## జనాలు చూసుకుని మురిసి పోవడమేనా ?

వైసీపీ అధినేత తాజాగా తెనాలికి వచ్చారు. తమ పార్టీకి చెందిన ఒక నాయకుడి ఇంట్లో ఫంక్షన్ కి ఆయన రావడం జరిగింది అయితే దారి పొడవునా జనాలు జగన్ కి నీరాజనాలు పట్టారు. దాంతో వైసీపీ శ్రేణులు ఉప్పొంగుతున్నాయి. అన్న వస్తే చాలు జన సందోహమే అని వారు హుషారు చేస్తున్నారు.జగన్ కి ఆదరణ ఎక్కడా తగ్గలేదని కూడా వైసీపీ అనుకూల మీడియాలో ప్రచారం సాగుతోంది. నిజమే జగన్ బయటకు వస్తే జనాలు ఆయనను చూసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. జగన్ వెంట పరుగులు తీస్తున్నారు. జగన్ కి జేజేలు పలుకుతున్నారు. జగన్ తో చేతులు కలిపి కరచాలనం చేయడానికి కూడా ఉరుకులు పెడుతున్నారు.అయితే జగన్ కి ఈ ఆదరణ కొత్తదా ఏమైనా అన్న చర్చ కూడా ఉంది. జగన్ అంటే అభిమానం ఎపుడూ ఉంది. ఆయన చుట్టూ జనాలు ర్యాలీ కావడం అన్నది ఆయన రాజకీయాల్లోకి వచ్చిన దగ్గర నుంచి జరుగుతూనే ఉంది. జగన్ అంటే జనం అన్నట్లుగా ఆయన పాదయాత్ర సాగింది.అలాగే 2024 ఎన్నికల ముందు జగన్ సిద్ధం సభలు పెడితే జనాలు పోటెత్తారు. సిద్ధం సభలను చూసిన వారు అంతా వైసీపీయే రెండోసారి అధికారంలోకి వస్తుందని కూడా అంచనా వేశారు. జగన్ బస్సు యాత్ర చేస్తే దాని వెంట జనాలు పరుగులు తీయడాన్ని అంతా చూశారు.కానీ ఫలితం తేడా కొట్టింది. అలా ఇలా కాదు ఏకంగా 11 సీట్లకే వైసీపీకి పరిమితం చేసి ఘోరమైన రాజకీయ అవమానాన్ని మిగిల్చింది. దాంతోనే కదా వైసీపీకి నడ్డి విరిగినంత పని అయి చతికిలపడిపోయింది. తిరిగి లేచేందుకు కనీస ప్రయత్నం చేస్తున్నా శక్తి చాలడం లేదని అంటున్నారు.ఇదిలా ఉంటే జనాలు రావడం అన్నది రాజకీయ పార్టీల విజయానికి కొలమానం కానే కాదు అన్నది చరిత్ర నిరూపించింది. ఇప్పటికి మూడు దశాబ్దాల క్రితం టీడీపీ రెండుగా చీలిపోయింది. బాబు టీడీపీ లక్ష్మీపార్వతి టీడీపీ అంటూ వేరు పడ్డాయి. 1996లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో లక్ష్మీపార్వతి ప్రచారానికి వస్తే జనాలు ఎక్కడ చూసినా విరగబడ్డారు. కానీ ఆమె పార్టీ ఒక్క సీటూ గెలుచుకోలేదు.ఇక సినీ నటులు కొంతమంది పార్టీ పెట్టి జనంలోకి వచ్చినపుడు వారికి వచ్చిన జనాలు వేరే ఎవరికీ రాలేదు. కానీ విజయం మాత్రం వారికి అందకుండా పోయింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. అందువల్ల జనాలను చూసి మురిసిపోతే ఇబ్బంది అవుతుంది అని అంటున్నారు.వైసీపీ మళ్ళీ 2029 ఎన్నికల్లో గెలిచి తీరాలీ అంటే దానికి చేయాల్సింది పార్టీని టాప్ టూ బాటం పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాల్సి ఉంది. పనిచేసిన వారికి పదవులు ఇవ్వాలి. కోటరీ మాటలు వినకుండా జగన్ స్వయంగా ఎవరు ఏమిటి అన్నది చూసుకుని మరీ లెక్క వేసుకుని పార్టీ పదవులు అప్పగించాలి.అధినాయకత్వం జనాలకు చేరువగా ఉండాలి. అదే సమయంలో పార్టీ జనాలకు కూడా చేరువ కావాలి. నాయకుడి దగ్గరకు వెళ్ళి ఏమైనా చెప్పుకోవచ్చు అన్న ధీమా క్యాడర్ లో కలగాలి. అంతే కాదు అయిదేళ్ళ ప్రభుత్వ పాలనలో వైసీపీ ఏ ఏ తప్పులు చేసింది అన్నది పూర్తి స్థాయిలో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఏ ప్రభుత్వంలో అయినా అన్నీ మంచే ఉండవు. జనాలకు నచ్చునివి ఉంటాయి.అలాంటి వాటిని పట్టుకుని మనస్ఫూర్తిగా తప్పులను దిద్దుకోవాల్సి ఉంది. ఇక వైసీపీ ని వీడిన వర్గాలను కానీ ఆ పార్టీ విధానాల పట్ల ఇబ్బంది పడి దూరం అయిన వారిని కానీ చేరువ చేసుకోవాలి. ఇలా ఎన్నో రిపేర్లు చేసుకుంటే తప్ప ఏపీలో ఫ్యాన్ గిర్రున తిరిగే అవకాశాలు ఉండవని అంటున్నారు. అయితే జగన్ కి జనాలు వచ్చారు. ఆయన ప్రజాదరణకు తిరుగులేదు అని భావించి వందిమాగధులు ఎవరైనా ధీమాకు పోయి అవే నిజమని అధినాయకత్వానికి చెప్పినా కోటరీ మాటలు విని అధినేత కోటలో కూర్చున్నా కూడా వైసీపీకి షాకులు తప్పవని అంటున్నారు. సో అదన్న మాట మ్యాటర్. ఇక వైసీపీ అలెర్ట్ కావడమే కీలకం.

## సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



**విజయవాడ పశ్చిమ మార్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, క్రిస్ప్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పశ్చిమ నియోజకవర్గం లోనీ అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు నైపుణ్య శిక్షణనిస్తున్నారు.అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ప్రాథమిక అభ్యాసాన్ని మెరుగుపరచడానికి కేబీఎన్ కళాశాల ఆవరణలో బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు.ప్రైవేటు పాఠశాలలో నర్సరీ విద్యకు ధీటుగా అంగన్వాడీల్లో చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగేలా తీర్చిదిద్దనున్నారు.బుధవారం జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో పోరంకి లోని వికాస విద్యా వనం పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని చిన్నారులకు ఆటపాటలతో చదువుపై దృష్టి కేంద్రీకరించేలా మరియు ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ మీద, అంగన్వాడీ టీచర్లకు నైపుణ్య శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికాసా విద్యావనం ఉపాధ్యాయులు అన్నపూర్ణ, అలేఖ్య, భారతి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ జీ ప్రశాంతి సుజనా ఫౌండేషన్, మరియు క్రిస్ప్ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు .

## ఆర్టీసీలో ముగిసిన 20వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణ

**విజయనగరం,మార్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి) :** నేడు స్థానిక విజయనగరం ఆర్టిసి గ్యారేజ్ వద్ద ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో 20 వ బ్యాచ్ అభ్యర్థులకు హెవీ డ్రైవింగ్ శిక్షణ బుధవారం తో ముగిసింది. ఈ జిల్లా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ డి మాణికుమార్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# ఎన్డీఏ కూటమితోనే అన్ని వర్గాలకు సరైన న్యాయం

### టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరా






**విజయవాడ పశ్చిమ మార్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ పోరాటానికి ఎట్టకేలకు ఎన్డీయే కూటమితో న్యాయం జరిగిందని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలపడంతో టీడీపీ నాయకులు పల్లె పోగు ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం చిట్టినగర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్,ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎన్డీయే కూటమి నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాల, మాదిగలకు న్యాయం చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. ఏ,బీ,సీ వర్గీకరణతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు.రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక నేత మందకృష్ణ మాదిగ చేసిన అనేక పోరాటాలకి ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు కూటమినేతలందరం మద్దతిచ్చినట్లు గుర్తు చేశారు. ఈ నిర్ణయంతో మందకృష్ణ మాదిగ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారన్నారు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంద వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ పై నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని ఎస్సీలందరం ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.టిడిపి నాయకులు పల్లె పోగు ప్రసాద్ మాట్లాడుతూ మాల, మాదిగ అందరికీ సమాన న్యాయం చేసేలా సీఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు అన్ని ఫలాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు ఇసుకపల్లి చంటి, ముదిగొండ శివ, ముదిరాజ్ శివాజీ, ముళ్ళపాటి ప్రకాష్, చినబాబు, చుక్క నరేష్, బుదాల నంద కుమారి, ఆకారపు విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద తాత్కాలిక షెడ్లు వేయండి

- పిల్లల తలిదండ్రులకు కుర్చీలు, తాగునీటి చౌకర్యాలు ఏర్పాటు చెయ్యండి
- మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర కి కందుల పరమేశ్వరరావు విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర



**విజయవాడ పశ్చిమ మార్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థులకు పరీక్షలు తల్లిదండ్రులకు కష్టాలకు గురిచేస్తున్నాయని వారి కష్టాలను తొలిగించాలని సామాజిక సేవకులుకందుల పరమేశ్వర రావు బుధవారం మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేశారు.విద్యార్థులను పరీక్షలకు తీసుకువచ్చిన తల్లిదండ్రులు, ముఖ్యంగా వృద్ధులు మండుటెండలో ఉదయం నుంచి పరీక్ష కేంద్రాల వద్ద నిడబడటానికి నీడ లేక కూచోవడనికి బెంచీలు గానీ కుర్చీలు గాని లేవు కనీసం తాగుతానికి మంచినీరు కూడా లేవనే విషయాన్నివిజయవాడ మున్సిపల్ కమిషనర్ కి కందుల పరమేశ్వర రావు వివరంగా తెలియజేశారు.పరిక్ష కేంద్రాల దగ్గర తాత్కాలిక షెడ్ కూర్చోవటానికి కుర్చీలు , తాగునీరు, తక్షణమే ఇవన్నీ ఏర్పాటు చేయాలని పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు అయిన కందుల పరమేశ్వర రావు మున్సిపల్ కమిషనర్ని కోరడం జరిగింది . విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇవన్నీ తక్షణమే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సోమ, బుధవారం స్వయంగా పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అట్లూరి శ్రీదేవి, పరిక్ష కేంద్రం స్కూల్స్ దగ్గరకు వెళ్లి అక్కడ ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులకు మంచినీరు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.ట్రస్ట్ సభ్యులైన డేగర రామారావు , మెట్టపల్లి తులసి, విద్యార్థులకు కూడా పరీక్షలు ఉన్నంతవరకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు.పరమేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ సమస్యలు అన్ని ఎన్ జీ ఓ సంస్థలకు తెలియజేసి తమ వంతు సహాయ సహకారాలు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అందజేస్తామనిట్రస్ట్ కార్యదర్శి మెట్టపల్లి అయ్యప్ప తెలియజేశారు.

# 46 వ,డివిజనులో ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

- ఉచిత నేత్ర వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం
- టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరా



**విజయవాడ పశ్చిమ మార్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పేదలకు ఖర్చు లేకుండా కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లను నిర్వహించడం అభినందనీయమని టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరా అన్నారు. ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని ) ఎమ్మెల్యే సుజనా చౌదరి , టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరా సారధ్యంలో టిడిపి సీనియర్ నాయకులు గుర్రంకొండ, 46వ డివిజన్ అధ్యక్షులు దీటీ ప్రభుదాస్ ఆధ్వర్యంలో శంకర నేత్ర వైద్యాలయ కంటి వైద్యుల సహకారంతో చిట్టి నగర్ 46 వ డివిజన్ మార్కు పేట లో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి అవసరమగు వారికి శస్త్ర చికిత్సలను చేస్తుందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.సున్నితమైన కంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఎమ్మెల్యే సుజనా చౌదరి విడతల వారీగా ఉచిత మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.ఈ శిబిరంలో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 100 మందికి శస్త్ర చికిత్సలు అవసరం అయ్యాయని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు పీ సంధ్యారాణి , సునీల్ కుమార్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బెవర లోకేష్, శ్రీనివాస్, కాజా రహమతుల్లా, చుక్కా నరేష్, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణం

## చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు

**మచిలీపట్నం మార్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థులకు మంచి, చెడులను నేర్పించాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బహుళ అంతస్తులు నిర్మాణం చేస్తున్నారు. తమ సొంత స్థలంలో బహుళ అంతస్తులు నిర్మాణం చేసి వ్యాపార సంస్థలకు అద్దెకు లేదా లీజుకు ఇవ్వాలని చూస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతిరోజు విద్యార్థులకు నీతి వాక్యాలు , ప్రభుత్వ నిబంధనలు, చట్టాల గురించి పాఠాలు చెబుతారు. కానీ తాము చెప్పే చట్టాలు, నిబంధనలు ప్రభుత్వ ఉపాధ్యాయులైన భార్యాభర్తలు ఇరువురు పాటించడం లేదని అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. నగరపాలక సంస్థ అనుమతులతో నిర్మిస్తున్న ఈ నిర్మాణం ప్రభుత్వ నిబంధన మేరకు సెట్ బ్యాక్ ను వదలాల్సి ఉండగా, ఈ నిర్మాణంను ప్రభుత్వ ఉత్తర్వులు తుంగలో తొక్కి నిర్మిస్తున్నారు.ఈడేపల్లి శక్తి గుడి సెంటర్ మెయిన్ రోడ్ లో నిర్మిస్తున్న ఈ బహుళ అంతస్తు నిర్మాణం నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టికి రాలేదన్నడం గమనార్హం. గతంలో రోడ్లకు ఒకవైపు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలను ప్రభుత్వ స్థలాలలో వేశారు. అయితే ఆ విద్యుత్ స్తంభం తన స్థలంలో వేశారు అంటూ ఉపాధ్యాయులు విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేశారు. అయితే మనీ మేక్స్ మెనీ థింగ్స్ అనే సామెత బహుశా విద్యుత్ శాఖ అధికారులకు బాగా తెలిసిన విషయం ఏమో ఆ విద్యుత్ స్తంభాలకు ఎల్ ఆకారంలో నీ ఇనుప యంగ్లర్లు వేసి విద్యుత్ తీగలను రోడ్డు వైపుకు మార్చడం విశేషం. విద్యుత్ శాఖ 11 కేవీహెచ్ కరెంటు స్తంభాలకు, తీగలకు మినిమం 5 అడుగుల దూరం వదిలి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, స్తంభాలకు ,తీగల కు ఆనిచ్చి నిర్మాణం చెయ్యడం విడ్డూరం కనిపిస్తుంది ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు బహుళ అంతస్తులు నిర్మిస్తుంటే నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నట్లు కనిపిస్తోంది. నగరపాలక సంస్థ అధికారులను ప్రభుత్వ నిబంధనలు ఉన్నవారికి ఒకలాగా లేని వారికి ఒకలాగా ఉంటాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ శాఖ కరెంటు తీగలకు మినిమం 5 అడుగులు దూరంలో నిర్మాణాలు




చేపట్టాల్సి దానిని పాటించకుండా నిర్మిస్తున్న కట్టడాలను చూసి చూడనట్లు విద్యుత్ శాఖ అధికారులు నిద్ర పోయినట్టు నటించటం కోసం మెరుపు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణం పై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు

## రైల్వే కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని సంఘ్ ధర్నా




**ఇబ్రహీంపట్నం, మార్చి 19 (వార్తా ప్రభా ప్రతినిధి :** అపరిష్కృతంగా ఉన్న రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య పిలుపు మేరకు గుంటుపల్లి బ్రాంచి నాయకులు వ్యాగన్ వర్క్ షాపు గేటు ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్క్ షాపు బ్రాంచి కార్యదర్శి, డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ గద్దా సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అపరిష్కృతంగా ఉన్న రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా, న్యాయమైన కోర్కెలను తీర్చకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. యూపీఎస్ పెన్షన్ విధానంలోని లోపాలను సరిచేసి అందరికీ ఓపీఎస్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వేల ప్రైవేటీకరణను ఆపాలని, రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రైల్వేలో ప్రస్తుతం ఉన్న పోస్టులను సరెండర్ చేసే ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలన్నారు. బోనస్ పై సీలింగ్ ను ఎత్తివేయాలని, వర్క్ షాపు కార్మికులపై అధిక పని భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే ప్రొటెక్షన్ యూనిట్స్ ను ప్రైవేటీకరణ చేసే ఆలోచన విరమించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి బ్రాంచి అధ్యక్షుడు పామర్తి శివ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్ రాజు, కోశాధికారి పి.విమల్ సాయి, గూడవల్లి సుధాకర్, ఎస్.బోయాజ్, ఎం.డి.రబ్బాని, కె.ఎల్.నాయక్, ఆర్.ఎన్.మద్దయ్య, కె.శంకరరావు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## భైరవకోన ప్రాంతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందితే భైరవకోన పరిసర ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయి

### బైరెడ్డి జయరామిరెడ్డి



**కనిగిరి మార్చి 19 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మోరుబోయిన గంగరాజు యాదవ్, అష్రఫ్ రైస్ ట్రేడర్స్ అధినేత షేక్ చిన హాజీ మలన్ బుధవారం ఏపీ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ని జిల్లా టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలవతో సన్మానించి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు భైరవకోన, మోపాడు రిజర్వాయర్ లను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని, నిధులు మంజూరు చేయాలని కోరారు. నూకసాని బాలాజీ స్పందిస్తూ భైరవకోన అభివృద్ధికి 50 లక్షల రూపాయలతో డిపిఆర్ పర్యాటక శాఖ కమిషనర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగినదని, అనుమతులు వచ్చిన వెంటనే కార్యాచరణ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని బైరెడ్డి తెలిపారు. అదేవిధంగా మోపాడు రిజర్వాయర్ పర్యాటక కేంద్రంగా , బోట్ షికార్, మరియు రిసార్ట్స్ కు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారని బైరెడ్డి తెలిపారు.

## తప్పు చేసిన వారికి శిక్ష, బాధితులకు న్యాయం చేయడమే పోలీసు సిద్ధాంతం

### సీఐ భీమా నాయక్



**కనిగిరి మార్చి 19 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం కనిగిరి బాలికోన్నత పాఠశాలలో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదు పై టీచర్ రంగారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయము తెలిసిందే. అయితే బుధవారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో బాధిత బాలికల బంధువులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. పామూరు సిఐ ఎం భీమానాయక్, ఎస్ ఐ కిషోర్ బాబు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష నుండి తప్పించుకోలేరని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని పామూరు సీఐ ఎం భీమా నాయక్ తెలిపారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**గార్లదిన్నె: మార్చి 19 వార్తా ప్రభ ప్రతినిధి** సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గార్లదిన్నె ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎవ రైనా అపరిచితులు బ్యాంక్ అధికారులమని, మీరు లక్కీ డ్రాలో గెలుపొందారని ఫోన్ చేస్తే నమ్మొద్దన్నారు. అలాగే ఆధార్, ఏటీఎం పిన్ నంబర్, ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు. ఓటీపీలు చెబితే బ్యాంకు ఖాతాలో నగదు సులువుగా కాజేస్తారన్నారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

● ప్రభుత్వానికి ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందండి ● అందుబాటులో 5 లక్షల (గోతాములు) గన్ని బ్యాగ్స్
● పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్.

**విజయవాడ పశ్చిమ మార్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధర పొందాలని రాష్ట్ర పౌర సరఫరాలు,ఆహారం,వినియోగ దారుల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ రైతులకు సూచించారు. బుధవారం నెల్లూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రి నాదెండ్ల మనోహార్ అధ్యక్షతన అసెంబ్లీ లోని మంత్రి ఛాంబర్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. నెల్లూరు జిల్లాలో గత రెండు సంవత్సరాలుగా ధాన్యం కొనుగోలు విషయంలో గత ప్రభుత్వం శ్రద్ధ చూపలేదని దీంతో రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోతున్న విషయం ప్రజా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహార్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి తక్కువ రేటు కు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్ద అన్నారు. ఇప్పటికే జిల్లాలో 46% వరి కోతలు పూర్తయ్యాయన్నారు. పండించిన ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి 24 గంటల లోనే డబ్బు పొంద వచ్చన్నారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని భరోసానిచ్చారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లా లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని,ఐదు లక్షల గన్ని బ్యాగులను



(గోతాములను) అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు పర్యటించి, ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలన్నారు. రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. అదేవిధంగా ప్రతి మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బంది ఉండే విధంగా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో సంఘం, కొవ్వూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ



అవుతుందన్నారు. రైస్ మిల్లర్ అసోసియేషన్ తో మాట్లాడి దళారుల ప్రమేయం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే రైతుకు ఇబ్బంది లేకుండా ప్రకాశం, బాపట్ల కందుకూరు తదితర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్,సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన రెడ్డి ,కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి, వెంకటగిరి ఎమ్మెల్యే కే. రామకృష్ణ , కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి లతో నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు ఉన్నారు.

## పంచాయతీ పారి శుధ్యం అందరి బాధ్యత

**- జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి**



**ఇబ్రహీంపట్నం,మార్చి 19 (వార్తా ప్రభ ప్రతినిధి):-** పంచాయతీ పారిశుధ్యం అందరి బాధ్యత అని,ప్రజలు తడి, పొడి,హానికరమైన చెత్తలకు వేర్వేరు డస్ట్ బిన్లను ఉపయోగించి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్య కుమారి విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామ పంచాయతీని ఆమె గురువారం సందర్శించారు. గ్రామస్థులకు తడి, పొడి, హానికరమైన చెత్తపై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ మూడు డస్ట్ బిన్ల ద్వారా వేరు చేసిన చెత్తను అందించడం ద్వారా చెత్త నుంచి సంపద తయారు చేయవచ్చున్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వానపాముల ద్వారా ఎరువుల తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి మనోజ్, సర్పంచ్ గొంది సురేష్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులు అల్లూరి సూర్యనారాయణ రాజుకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే డిఎన్ఆర్.



**కలిదిండి మార్చి 19 (వార్తా ప్రభ)** వైయస్సార్ సిపి ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు,కైకలూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు ఈ రోజు ఉదయం కలిదిండి మండలం, చినతాడినాడ లో వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు అల్లూరి సూర్యనారాయణ రాజు(సూర్యం) స్వర్గస్తులు కాగా వారి స్వగృహమునకు సతీ సమేతంగా వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు మాజీ పార్లమెంట్ సభ్యులు కనుమూరి బాపిరాజు ,రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్,రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి కూసంపూడి కనకదుర్గ రాణి(బుజ్జమ్మ),కలిదిండి మండలం ఎంపీపీ చందన ఉమా మహేశ్వరరావు,కలిదిండి మండల పార్టీ అధ్యక్షులు తిరుమని రమేష్,కలిదిండి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ,చినతాడినాడ గ్రామ సర్పంచ్ గండికోట ఏసుబాబు, కలిదిండి మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాము రవికుమార్,సాగి వెంకట రాజు,పెన్మత్స నాగరాజు,బొర్రా శ్రీను గారు, పెన్మత్స ఏడుకొండలు,బొర్రా నాగరాజు,హరికృష్ణ,పెన్మత్స ఏడుకొండలు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ఆర్యోక్తులు



చేయొద్దు పెద్దలను
ఎప్పుడు అపహాస్యము
వేయొద్దు నిందలను
వీడుము నీచగణము
దాటొద్దు హద్దులను
బ్రతుకగు కల్లోలము
వదలొద్దు లక్ష్యమును
చేజారును విజయము
చూపొద్దు భేదమును
మిగులుతుంది ఖేదము
చూడొద్దు అశుభమును
తెస్తుంది ప్రమాదము
పెట్టొద్దు గొడవలను
చెడిపోవును బంధము
చీల్చొద్దు మిత్రులను
అంతులేని నష్టము

**-గద్వాల సోమన్న,ఎమ్మిగనూరు**

## మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో రాజకీయ ప్రతినిధులతో సమీక్ష సమావేశం

**విజయవాడ పశ్చిమ మర్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ మరియు ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సెంట్రల్ నియోజకవర్గం ధ్యానచంద్ర బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల సంఖ్య 1200 దాటిన ప్రాంతాల్లో సమీపంలోని పోలింగ్ స్టేషనులకు మార్పులు చేయాలని చర్చించారు. ఏ ఈఆర్వోలను, బిఎల్ఓ తో ఒక సమావేశం నిర్వహించి పోలింగ్ బూతులను బిఎల్ఓ తో పరిశీలించి, వసతులన్నీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటర్లకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాల నుండి, దగ్గరగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు మార్చవలసిందిగా పొలిటికల్ పార్టీ ప్రతినిధులు కోరారు. నూతన ఓటర్లకు ఓటర్ ఐడి పోస్ట్ ద్వారా కానీ వారి బి ఎల్ ఒ ద్వారా కానీ పంపిణీ చేసేటట్టు చర్యలు తీసుకోవాలని ఏ ఈ ఆర్ ఓ లకు ఆదేశాలు ఇచ్చారు. గేటెడ్ కమ్యూనిటీలో కాలనీలో గల ఓటర్లకు ఆ ప్రాంతంలో గల పోలింగ్ కేంద్రాలను కేటాయిస్తే ఓటర్లు పూర్తి స్థాయిలో ఓటు వేసే అవకాశం ఉంటుందని చర్చించారు. స్వీఫ్ ( సిస్టమాటిక్ ఓటర్లు ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రానిక్ పార్టిసిపేషన్ ) కార్యక్రమాల ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించాలని ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాజకీయ ప్రతినిధులు నరహరిశెట్టి



నరసింహారావు (ఐ ఎన్ సి), వీరభద్రరావు (సిపిఐ), వినోద్ కుమార్ (బీఎస్పీ), తరుణ్ (బిజెపి), సాంబశివరావు (టిడిపి), సుందర్ పాల్ (వైఎస్ఆర్సిపి) పరమేశ్వరరావు (ఏఏపీ), విజయవాడ నగర పాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, జోనల్ కమిషనర్ కె ప్రభుదాస్, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్) పి సత్యకుమారి,సెంట్రల్ తహసిల్దార్ ఎం వెంకటరామయ్య, నార్త్ తహసిల్దార్ ఎం సూర్యారావు, డిప్యూటీ తహసిల్దార్ సెంట్రల్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## తిరుమలలో సాధువుల అరెస్ట్ పై మల్లాది విష్ణు ఫైర్

● సాధువుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు అమానుషం ● ముంతాజ్ హోటల్ నిర్మాణ అనుమతులు తక్షణమే రద్దు చేయాలి ● వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

**విజయవాడ పశ్చిమ మార్చి 19 (వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుమలలో సాధువుల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరు అమానుషమని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయటంపై ఆయన తీవ్రంగా స్పందించారు. హిందువుల మనోభావాలకు విరుద్ధంగా తిరుమలలో నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్‌కు అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి నుంచి విశాఖ వెళ్తున్న రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద సరస్వతి స్వామిని మార్గమధ్యలో ఆయన కలిసి పరామర్శించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక నగరాన్ని పర్యాటకం పేరిట కూటమి ప్రభుత్వం నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత ముంతాజ్ హోటల్ నిర్మాణంపై సాధువులు, హైందవ సంఘాలు భగ్గు మంటున్నా.. ఈ ప్రభుత్వంలో కనీస చలనం లేదని ధ్వజమెత్తారు. తిరుమల ప్రక్షాళన అంటే.. ఏడు కొండలను అపవిత్రం చేయటమా..? అని నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం హిందూ సమాజాన్ని మోసం చేసిందని.. తిరుమల కొండలను కళంకం చేసేలా అన్యమతానికి చెందిన ముంతాజ్ హోటల్ నిర్మాణానికి అనుమతివ్వడం దారుణమన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ పట్ల, తిరుమల పవిత్రత పట్ల ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలను ఒక వ్యాపార కేంద్రంగా మార్చి వేసిందని ఇప్పటికే అనేక సందర్భాలలో భక్తులు ఆవేదన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. హిందు ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత సాధువులపై ఉందని.. కానీ శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సాధువుల పట్ల ఈ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. తాము ఆందోళన చేసేందుకు వెళ్లడం



లేదని, స్వామిని దర్శించుకుని వినతిపత్రం సమర్పిస్తామని చెప్పినా ఈ ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందన్నారు. పైగా మెడలు పట్టుకొని సాధువులను బలవంతంగా వ్యాను, కార్లు ఎక్కించటం దుర్మార్గమన్నారు. తిరుమల ప్రక్షాళణ అంటూ వల్లె వేసే సీఎం చంద్రబాబు, సనాతన ధర్మ పరిరక్షణ అంటూ ఊగిపోయే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు దీనిపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో హెటల్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వకపోయినా.. అప్పట్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదని మల్లాది విష్ణు అన్నారు. శేషాద్రి పర్వతం అంచున అన్నమయ్య సహా ఎంతో మంది రుషులు తపస్సు చేసిన చోట ముంతాజ్ హెటల్ కు అనుమతినివ్వడం హిందువులను మోసం చేయడమేనని.. తక్షణమే కోట్లాది హిందువుల మనోభావాలను గౌరవించి అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా హైందవ సోదరులు ఏకమై.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించటం ఖాయమని హెచ్చరించారు.

## త్వరలో మంగినపూడి బీచ్ ఉత్సవాలు

**బీచ్ ఉత్సవాల ఘనంగా నిర్వహించాలి**
**- మంత్రి కొల్లు రవీంద్ర**



**మచిలిపట్నం మార్చి 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మంగినపూడి బీచ్ ఉత్సవాలను త్వరలో ఘనంగా నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో మంగినపూడి బీచ్ ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గతంలో మంగినపూడి బీచ్ ఉత్సవాలను ఎలా నిర్వహించారో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్ తర్వాత రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర తో బీచ్ ఉత్సవాలపై చర్చించి నిర్వహణ తేదీలు తదుపరి నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలు ఒకరోజు నిర్వహించాలా లేదా 3 రోజులు నిర్వహించాలా అనే అంశంపై మంత్రితో చర్చిస్తామన్నారు అలాగే గతంలో లాగా మ్యూజికల్ నైట్, ఫుడ్ స్టాల్స్, జెయింట్ వీల్, కొలంబస్ వంటి పిల్లలు ఆడుకునే ఎగ్జిబిషన్, హ్యాండీక్రాఫ్ట్స్, హెలికాప్టర్ రైడింగ్, గుర్రపు స్వారీ, వాటర్ స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, 100 అడుగుల దోసె, బీచ్ కబడ్డీ, మంచినీరు, మరుగుదొడ్లు,గ్రీన్ రూములు, వేదిక తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అయ్యే ఖర్చుల అంచనాల నివేదిక సిద్ధం చేయాలన్నారు. గతంలో బీచ్ ఉత్సవాలకు విపరీతంగా పర్యాటకులు రావడంతో రాకపోకలు చాలా ఇబ్బంది పడిన దృష్ట్యా అది పునరావృతం కాకుండా జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ప్రత్యామ్నాయంగా పార్కింగ్ ప్రదేశం దూరంగా ఉంచి బయట నుండి వచ్చే పర్యాటకుల వాహనాలను అక్కడ నిలిపివేసి, అక్కడి నుంచి ప్రభుత్వ వాహనాలలో సముద్రతీరం వద్దకు చేర్చే ఏర్పాట్లు చేయాలని ఆలోచన ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జునరావు, జెడ్పిసిఈఓ కన్నమ నాయుడు, ఆర్డీవో స్వాతి, మెప్మా పీడీ సాయిబాబా, డిపిఓ అరుణ, పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, పంచాయతీరాజ్ ఎస్ ఇ రమణ రావు, మున్సిపల్ కమిషనర్ కాఫీ రాజు, డిఎస్పి సిహెచ్ రాజు, మెరైన్ పోలీస్ విభాగం ఎస్సై జగదీష్ చంద్ర బోస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నిమ్రా నర్సింగ్ కళాశాలలో అగ్నిమాపక భద్రత అవగాహన కార్యక్రమం



**ఇబ్రహీంపట్నం, మార్చి 19(వార్తా ప్రభ ప్రతినిధి):**వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల నుండి ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు విజయవాడ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ గుండిమెడ నారాయణ. మండల పరిధిలోని నిమ్రా నర్సింగ్ కళాశాలలో బుధవారం నాడు విద్యార్థినీ విద్యార్థులు మరియు సిబ్బందికి అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అగ్నిప్రమాదులు జరిగినప్పుడు వెంటనే ఎలా స్పందించాలి, ఏ విధంగా నివారణ చర్యలు తీసుకోవాలి, అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి పలు అంశాలపై విద్యార్థినీ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాదాలకు కారణాలు, నివారణ చర్యలు, ప్రతిస్పందన,అగ్నిమాపక భద్రతా నియమాలు గురించి వివరించారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, ప్రథమ చికిత్స లాంటి పలు అంశాలను చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ కోకిల, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

**కలెక్టర్ తమీమ్ అన్సారియ బాల్యవివాహాల పై దృష్టి సారించి చర్యలు చేపట్టడం**

## వలన బంగారు బాల్యం కు జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు

**అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి**




**కనిగిరి మార్చి 19 వార్తా ప్రభ ప్రతినిధి** జాతీయస్థాయిలో ప్రకాశం జిల్లా బంగారు బాల్యానికి స్కోచ్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియ కు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం అభినందనలు తెలిపారు. జాతీయస్థాయిలో బాల్యవివాహాలలో రాష్ట్రంలోనే ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో ఉండటంతో జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీమతి తమీమ్ అన్సారియ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి బంగారు బాల్యంను రూపొందించారు. ఈ కార్యక్రమానికి జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన స్కోచ్ అవార్డు లభించడం కలెక్టర్ తమీమ్ అన్సారియ కృషి, జిల్లాకు జాతీయస్థాయిలో అవార్డు రావడం గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు



**కలువాయి మార్చి 19 (వార్తా ప్రభ)** మాదిగల ఆశాజ్యోతి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 30 సంవత్సరాల వర్గీకరణ ఉద్యమ పోరాట ఆకాంక్షను నెరవేరుస్తూ రాష్ట్ర కేబినెట్ లో ఆమోదం తెలపడం హర్షదాయకమని మండల అధ్యక్షుడు దండు భార్గవ్ మాదిగ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచేసినటువంటి ఎంఈఓ జిల్లా నాయకులు చీలపాగు నరసయ్య మాదిగ మాట్లాడుతూ 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఎన్నో ఉద్యమాలు చేసి తన జీవితాన్నే మాదిగ జాతి కోసం అంకితం చేసిన ప్రజా నాయకుడు మా అన్న కృష్ణ మాదిగ ఎలక్షన్లలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలిపిన మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి మాదిగ జాతి మొత్తం తరుపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాయకులు చేజర్ల శ్రీనివాసులు దండు వినోద్ ఒంగోలు హరి మంగళ వినోద్ దండు రాజా దండు రవి శంకర్ మరియు టిడిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరసింహులు ఎంఆర్పిఎస్ ఎంఈఓ నాయకులు మాదిగ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## గోండు గోవారిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి

**అదిలాబాద్ మార్చి 19 (వార్తా ప్రభ)**జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న గోండు గోవారిలు తెలంగాణ రాష్ట్రంలో ఏ కులంలోనూ చేర్చకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని తమను ఎస్టి సామాజిక వర్గంలో చేర్చాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన గుండు గోవారిల సంఘ ప్రతినిధులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. తమ కులాన్ని జాబితాలో చేర్చకపోవడంతో తమ పిల్లలు చదువుకోలేకపోతున్నారని ఆయనకు వివరించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సైతం కలిసి వారు వినతిపత్రం ఇచ్చారు

# సీఎం రేవంత్ రెడ్డిపై కేసును కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

- నార్సింగి పీఎస్‌లో రేవంత్ రెడ్డిపై నమోదైన కేసు కొట్టివేత
- జన్వాడలో డ్రోన్ ఎగురవేశారంటూ రేవంత్ రెడ్డిపై కేసు నమోదు
- నాడు రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన నార్సింగి పోలీసులు

**హైదరాబాద్, మార్చి 19 :**(వార్తా ప్రభ ప్రతినిధి)రేవంత్ రెడ్డిపై 2020లో నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. మాజీ మంత్రి కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్‌పై డ్రోన్ ఎగురవేశారంటూ రేవంత్ రెడ్డితో పాటు మరికొంత మందిపై నార్సింగి పీఎస్‌లో 2020 మార్చిలో కేసు నమోదైంది. అప్పుడు ప్రతిపక్షంలో రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దీంతో ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

**నిషేధిత ప్రాంతంలో లేదు :** రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జన్వాడ నిషేధిత ప్రాంతమేమీ కాదని, సీఎం రేవంత్ రెడ్డిపై తప్పుడు సెక్షన్లు నమోదు చేశారని ధర్మాసనానికి తెలిపారు. డ్రోన్ ఎగురవేసిన ప్రాంతం ఎటువంటి నిషేధిత జాబితాలో లేదని పీపీ న్యాయస్థానానికి వివరించారు. దీంతో పూర్తి వాదనలు విన్న న్యాయస్థానం నార్సింగి పీఎస్‌లో సీఎం రేవంత్ రెడ్డిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులను వెలువరించింది.

**కేటీఆర్‌పై నమోదైన కేసు కొట్టివేత :** మాజీ మంత్రి కేటీఆర్‌పై గతంలో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసును కూడా కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్ రెడ్డిని కించపరిచే విధంగా మాట్లాడారని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు కేటీఆర్‌పై కేసు నమోదు చేశారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడంతో దానిని కొట్టేయాలని మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

**ఇష్టారీతిన మాట్లాడారు :** విచారణ సందర్భంలో బాధ్యత గల హోదాలో ఉన్న మాజీ మంత్రి కేటీఆర్ ఇష్టారీతిన మాట్లాడారని, సీఎంను కించపరిచే విధంగా మాట్లాడారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. రాజకీయ కక్షల కారణంగానే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు నమోదు చేశారని ఆయన తరఫున న్యాయవాది వాదించారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది. ఇటీవల ఫార్ములా ఈ రేసులో మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ ఏసీబీ కేసును నమోదు చేసిన విషయం తెలిసిందే. పలుమార్లు విచారణకు పిలిచి ఆయన నుంచి పోలీసు ఉన్నతాధికారులు వాంగ్మూలాలను సేకరించారు.

# పేదల బడ్జెట్ కాదు... ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్.

## - బారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ ఆగ్రహం



**శేరిలింగంపల్లి,మార్చి 19 (వార్తాప్రభ):**కాంగ్రెస్ ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డిపై భారాస సీనియర్ నేత రవీందర్ యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.బడ్జెట్ పేద ప్రజల కష్టాలను తీర్చేదిగా లేదన్నారు.కేవలం ఢిల్లీకి మూటలు పంపేలా ఉందని మండిపడ్డారు.ఆకాశం నుంచి పాతాళానికి బడ్జెట్ పోతుందన్నారు.పరిపాలన చేతకాని ప్రభుత్వమని విమర్శించారు.రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ బడ్జెట్ లో ఆరు గ్యారంటీలు గోవిందా అని, హామీలకు పాతర వేశారని చెప్పారు. మహిళలు,వృద్ధులకు ఇచ్చిన హామీల పైన బడ్జెట్ లో ప్రస్తావించలేకపోవడం తీవ్ర అన్యాయం అన్నారు. తుల బంగారంకు దిక్కు,దివానా లేదన్నారు. స్కూటీలు ఇస్తామని చెప్పారని,బడ్జెట్లో కేటాయించకుండా ఎలా ఇస్తారని నిలదీశారు.చేనేత కార్మికులకు 300 కోట్లు కేటాయిస్తూ అన్యాయం చేశారని చెప్పారు. ఆటో కార్మికులను ఆదుకుంటామని ప్రకటనలు చేసిన సర్కార్,బడ్జెట్ లో దాని గురించి ప్రస్తావనే లేదన్నారు. యాదవులకు ఇచ్చిన హామీలకు నిధులను కేటాయించకపోవడం కరెక్ట్ కాదన్నారు.దళితులను మరోసారి దగా చేశారని మండిపడ్డారు.నిరుద్యోగులకు ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి గురించి ఒక్క మాట లేదని చెప్పారు.ఉద్యోగాలు ఇచ్చింది కెసిఆర్ అయితే కేవలం అపాయింట్ లెటర్లు ఇచ్చింది కాంగ్రెస్ అని,కానీ తామే ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యా భరోసా గురించి ప్రస్తావించలేదని మండిపడ్డారు.గురుకుల పాఠశాలలో పిల్లలు చనిపోతే పట్టించుకోలేదని,అలాంటి ప్రభుత్వం రాష్ట్రంలో ఉండటం దురదృష్టకరమని చెప్పారు. ట్రిలియన్ డాలర్ లో ఎన్ని సున్నాలు ఉంటాయో తెలియని నేతలు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని,వారి పాలనలో ట్రిలియన్ డాలర్లకు తీసుకువెళ్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజల కష్టాలను తీర్చేది కాదని అన్నారు.కేసీఆర్ పాలనలోనే స్వర్ణయుగం సాగిందని,ప్రజల సమస్యలను తీర్చడంతో పాటు సరైన సంక్షేమాన్ని అందించారని రవీందర్ యాదవ్ కొనియాడారు.

# ఎస్సీ వర్గీకరణ,బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం

## కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలభిషేకం చేసిన కాంగ్రెస్ శ్రేణులు





**కూకట్ పల్లి, మార్చ్19(వార్తాప్రభ):**ఎన్నికల హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ లకు విద్యా , ఉద్యోగ , స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీ కు 42 శాతం, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదిస్తూ శాసన సభ మరియు మండలి లో ఏకగ్రీవంగా ఆమోదింప జేసినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు ఈ బిల్లుకు ఆమోదం తెలిపిన అన్నీ రాజకీయ పార్టీలకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుమార్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు బుధవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ తో కలిసి రాహుల్ గాంధీకి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి బాణాసంచ పేల్చి,శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ బిల్లును కేంద్రానికి పంపించటమే కాకుండా ఈ బిల్లును 9 వ షెడ్యూల్ లో పెట్టి ప్రధాన మంత్రి ద్వారా పార్లమెంట్ లో ప్రవేశ పెట్టీ ఆమోదింప చేసేవిధంగా ముఖ్యమంత్రి కృషి చేస్తాను అనడం అభినందనీయం మన రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు బీజేపీ ఎంపీలు కూడా కేంద్రం తో విన్నపించి పార్లమెంట్లో బిల్లును ఆమోదింప చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 122 డివిజన్ అధ్యక్షుడు భాష్పక యాదగిరి,భేరి రామచంద్ర యాదవ్,ఉప్పల కల్పన, స్థానిక నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ సాహసోపేత నిర్ణయాలు భేష్

## హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ శ్రేణుల ఉత్సవాలు.





**శేరిలింగంపల్లి,మార్చి 19 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని చందనగర్ డివిజన్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కాంగ్రెస్ అధినాయకులు రాహుల్ గాంధీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,రిజర్వేషన్ కమిటీ చైర్మన్ లు,పొన్నం ప్రభాకర్,దామోదర రాజనర్సింహ,మైనారిటీ నాయకులు షబీర్ అలీ,ఫాయిమ్ క్కురీషి చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్,నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి,మంత్రులు,నాయకుల కృషి అభినందనీయమని రాష్ట్ర ప్రజల తరఫున వారికి ధన్యవాదాలు తెలిపారు.బీసీ కుల గణన ఒక సాహసోపేత నిర్ణయం అని,త్రికరణ శుద్ధిగా లెక్క తేల్చిన ఘనత మన తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందని,వందేళ్లలో జరగనిది తెలంగాణ రాష్ట్రంలో 100 శాతం సరైన లెక్కలు తేల్చారని.రాజకీయ ప్రేరేపితానికి లోనైతే బీసీలు శాశ్వతంగా నష్టపోతారు,బీసీలు ఓన్ చేసుకోకపోతే ఈ లెక్కలు పట్టాలెక్కవు,కుట్రలను ఛేదించకపోతే బీసీలు శాశ్వతంగా నష్టపోతరూ అని ముఖ్యమంత్రి అన్న మాటలను గుర్తు చేశారు..సీఎం రేవంత్ రెడ్డి కి,మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఇది చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించే రోజు అని,బీసీలు/ఎస్సీల/మైనారిటీలు రాజకీయంగా,ఆర్థికంగా,సామాజికంగా లబ్ది పొందుతారన్నారు.ఎస్సీ వర్గీకరణ బిల్లు పాస్ అయినందున చాలా సంవత్సరాల కల నెరవేరిందని అన్నారు.ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని,స్వాతంత్రం వచ్చిన తర్వాత ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన చెయ్యని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ప్రజలు ఇది గమనించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్,మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్,శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్డినేటర్ రఘునందన్ రెడ్డి,నాయకులు బలింగ్ యాదగిరి గౌడ్,మహిపల్ యాదవ్,విరేశం గౌడ్,కట్ల శేఖర్ రెడ్డి,నరందేర్ గౌడ్,ఉరిటీ వెంకట్ రావు,మన్నెపల్లి శంబశివరావు,సుదర్శన్,డివిజన్ అధ్యక్షులు అలీ,జహంగీర్,భరత్ గౌడ్,రేణుక,బాష్పక యాదగిరి,మరేళ్ల శ్రీనివాస్,డిసిసి ఉపాధ్యక్షులు సురేష్ గౌడ్,విజయభాస్కర్ రెడ్డి,శేఖర్ ముదిరాజ్,పట్వారీ శశిధర్,సౌందర్య రాజన్,యలమంచి ఉదయ్ కిరణ్,రవి కుమార్,ఓబీసీ నాయకులు హరికిషన్,రామచందర్,కంకారెడ్డి,సాయన్న,వెంకట్ నారాయణ,నర్సింగ్ రావు,దుర్గేష్,రాజా రెడ్డి,నవీన్ రెడ్డి,యాదయ్య గౌడ్,కార్తిక్ గౌడ్,ప్రణయ్ గౌడ్,సత్య రెడ్డి,కృష్ణ గౌడ్,నర్సింహ గౌడ్,హరనాథ్ గౌడ్,పరుశురాములు,యకయ్య,కుమార్ యాదవ్,యాదగిరి,మైనారిటీ చైర్మన్ అజీమ్,నాయకులు ఆయాజ్ ఖాన్,హనీఫ్,సయ్యద్‌బాబా,గఫర్,ముజీబ్,ముక్రం,జావేద్,యూసుఫ్, మౌలానా,నజీర్,సాజిద్,పాషా, అశోక్,రాంబాబు,హరి,శ్రీను,నవీన్,పద్మరావు,లక్ష్మణ్,మల్లేష్,కృష్ణ,ప్రసాద్ ముదిరాజ్,మల్లేష్,మహేష్, రాజేష్,మహిళలు కల్పన ఏకాంత్ గౌడ్,నళిని,ప్రియదర్శిని ,పార్వతి,రాజలక్ష్మి,జయ,శాంత తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి లో ప్రకటన

- ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సూచన ప్రకారం చర్యలు
- అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి పాస్ చేయించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం
- భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తుంది
- కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి వెల్లడి



**కూకట్ పల్లి,మార్చి 19(వార్తాప్రభ):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్ చేయించడం అభినందనీయమని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. బుధవారం కూకట్ పల్లి నియోజకవర్గం లోని ఆసియాలో అతిపెద్ద కాలనీగా పేరుందిన కే.పి.హెచ్.బి కాలనీలో ఎస్ ఎస్ ఆర్ కార్యాలయం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీ దేశంలో ప్రాజెక్టులు కట్టింది, పరిశ్రమలు పెట్టి ఈ దేశ అభివృద్ధిలో కీలక భూమిక పోషించిందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కేటాయిస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ హామీ మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి ఆమోదింప చేయడం బీసీ వర్గాలకు భవిష్యత్తులో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా ఎంతో న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో సైతం ఇచ్చిన హామీల కట్టుబడి పని చేస్తూ రాష్ట్ర సమాగ్రాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్లతోపాటు ఎస్సీ రిజర్వేషన్ల బిల్లు సైతం అసెంబ్లీలో పెట్టి ఆమోదింప చేయడం ఇది దేశ రాజకీయ చరిత్రలో మరుపురాని ఘట్టమన్నారు. కార్యక్రమంలో... కంటెస్టెడ్ ఎమ్మెల్యే బి సంజీవరావు, కంటెస్టాడ్ కార్పొరేటర్ బి యాదగిరి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమార్ యాదవ్, రాజు ముదిరాజ్,కొమ్ము బాబురావు,గిరి నాయుడు, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత త్రాగునీరు అందిస్తున్న బిజెపి నాయకుడు

**హుస్నాబాద్ మార్చి 19 (వార్తా ప్రభ)** హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు వేసవి దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేసి ఉచిత త్రాగునీరు అందిస్తున్న బిజెపి నాయకుడు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డిని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అభినందించారు. చలివేంద్రాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో రోజుకు 32,000 లీటర్ల శుద్ధ మంచినీటిని ప్రజలకు ఉచితంగా అందివ్వడం గొప్ప విషయమని బైరి శంకర్ అన్నారు. పేద ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉండేది బిజెపి పార్టీ అని గుర్తు చేశారు. నియోజకవర్గంలో బాటసారులు, ప్రజల దాహార్తి తీర్చడానికి 16 చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశామని సురేందర్ రెడ్డి తెలిపారు.

# వైసీపీ నాయకులు తలారి హరీష్ మిత్ర పార్థివ దేహాన్ని సందర్శించిన మాజీ మంత్రి, పశ్చిమ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు



**విజయవాడ పశ్చిమ మార్చి 19 (వార్తా ప్రభ ప్రతినిధి)**వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తలారి హరీష్ మిత్ర అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. హరీష్ మిత్ర మృతి పట్ల మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తపరుస్తూ భవానీపురం లోని ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ లోని హరీష్ మిత్ర నివాసం వద్ద ఉంచిన హరీష్ మిత్ర పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం హరీష్ మిత్ర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఎస్సీవర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదించడంతో వర్షం

## మందకృష్ణ మాదిగ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలభిషేకం



**తొర్రూర్ మార్చి 19 (వార్తా ప్రభ)**ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో, మాదిగలు తొర్రూర్ పట్టణ కేంద్రంలో, బుధవారం బస్టాండ్ చౌరస్తాలో, సీఎం రేవంత్ రెడ్డి మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం జరిగింది.గత 30 సంవత్సరాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఫలితంగా శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొంది చట్టరూపం దాల్చిన సందర్భంగా రేవంత్ రెడ్డి కి కృష్ణ మాదిగ గార్లకు తొర్రూరుడివిజన్ ఎమ్మార్పీఎస్ ఎంపీఎఫ్ తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మార్పీఎస్ తొర్రూర్ మండల ఇన్చార్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎం ఇ ఎఫ్ రాష్ట్ర నాయకులు సోమారపు ఐలయ్య మాదిగ మాజీ జెడ్పిటిసి మంగళపెల్లి శ్రీనివాస్ మాదిగ ఎంఈఎఫ్ మాంకాల బుచ్చయ్య మాదిగ,లు మాట్లాడుతూ మాదిగ మాది ఉప కులాలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్ ఫలాలను సామాజిక న్యాయ సూత్రం ప్రకారం వర్గీకరించాలనే ఉద్దేశంతో కృష్ణమాది గత 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేసి సాధించిన ఫలితంగానే ఎస్సీ వర్గీకర సాధ్యమైంది అని తెలిపారు. దానిలో భాగంగానే ముఖ్యమంత్రి మాదిగ హక్కులను గుర్తించి వివిధ రాజకీయ పార్టీలను సంఘాలను సమీకరించి వర్గీకరణ చేయడం జరిగింది అన్నారు.అయినప్పటికీ జనాభా ప్రాతిపదికన రావలసిన హెూట కంటే తక్కువ రావడం అనేది కొంత బాధగా ఉందని రాబోయే రోజులలో జనాభా ప్రాతిపదికన మాకురావలసిన 11% రిజర్వేషన్ అమలు పరచాలని కోరారు . అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు కుల సంఘాలకు వామపక్ష పార్టీలకు ప్రజా సంఘాలకు మేధావులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పంతం సురేందర్ మాదిగ ఎంఆర్పిఎస్ నాయకులు రాయిశెట్టి వెంకన్న మాదిగ,బచ్చలి వెంకన్న మాదిగ, రాయిశెట్టి ఉపేందర్ మాదిగ డాక్టర్ ధర్మారపు నాగన్న మాదిగ ఎంఈఎఫ్ నాయకులు కుంట కొమ్ము బిక్షపతి మాదిగ ఈదురు రమేష్ మాదిగ,గుండాల రంజిత్ సురేందర్ రమేష్ ఉపేందర్ ఏర్పుల వెంకన్న నగరగంటి వెంకన్న మాదిగ మల్లేష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అమ్మిన,సేవించిన చట్ట ప్రకారం నేరం డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి

## -ఒకటవ పోలీస్ స్టేషన్లో ఐదుగురిపై కేసు నమోదు,అరెస్ట్.

**ఆదిలాబాద్ మార్చి 19 (వార్తా ప్రభ)**యువత గంజాయి మత్తు బారిన పడకుండా తల్లిదండ్రులు వారిపై శ్రద్ధ వహించాలని డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు.ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఈరోజు ఐదుగురిపై కేసు నమోదు చేయబడిందని అందులో ఇద్దరు గంజాయి అమ్మేవారు,ఒక గంజాయి ని పండించేవాడు, ఇద్దరు గంజాయి సేవించేవారు ఉన్నారని తెలిపారు.వీరి వద్దనుండి 35 గ్రాముల గంజాయి, 5 మొబైల్ ఫోన్లో స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.గంజాయి అమ్మిన సేవించిన చట్టప్రకారం నేరమని ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ గంజాయిని జిల్లా లో రూపుమాపాలనే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం క్రిత నిశ్చయంతో పనిచేస్తుందని తెలిపారు.





మాజీమంత్రి మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి పెళ్లిరోజు సందర్భంగా వారి దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేసిన జవహర్ నగర్, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, **జవహర్ నగర్, మార్చి,19:(వార్తా ప్రభ)**

# గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం..

● గుడివాడ మండల ఎంపిడిఓ విష్ణుప్రసాద్



**గుడివాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర ప్రత్యేక గిరిజన గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకుని లబ్ధి పొందాలని ఎంపీడీవో శ్రీ. బి.వై. విష్ణు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, అదేవిధంగా ఇతర ప్రత్యేక గిరిజన లబ్ధిదారులకు రూ.లక్ష అదనపు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ నగదు మొత్తం ఒకేసారి కాకుండా గృహనిర్మాణ దశల్లో పునాది మొదలుకొని నిర్మాణం పూర్తయ్యే వరకు వివిధ దశల్లో లబ్ధిదారులకు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల గుడివాడ మండలంలో 606 మంది బీసీ లబ్ధిదారులకు, 562 మంది ఎస్సీ మరియు 15 ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కావున మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ ఎంపిడిఓ కోరారు. అలాగే మండలంలోని గ్రామాల్లో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించడం జరిగిందనీ చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం క్రింద 100రోజుల పని కల్పించనున్నట్లు ఎంపిడిఓ తెలియజేశారు.

# మైలవరంలో ఎస్సీ బాలికల హాస్టల్ వసతి గృహ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు

● ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కి లేఖ ద్వారా తెలిపిన మంత్రి బాల వీరాంజనేయ స్వామి

**మైలవరం,మార్చి 19 (వార్తాప్రభ) :** మైలవరం పట్టణంలోని రాజుపేట లో ఎస్సీ బాలికల వసతి భవనాన్ని నిర్మించడానికి రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ, వికలాంగులు మరియు సీనియర్ సిటిజన్ సంక్షేమం, సచివాలయం,మరియు గ్రామ వాలంటీర్ ప్రభుత్వం శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రకటన విడుదల చేశారు.ఈ మేరకు స్థానిక మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు కి ప్రత్యేక లేఖ ద్వారా ఈ విషయాన్ని తెలియజేశారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని హాస్టల్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని, ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ని మంత్రి కోరారు.నిధులు మంజూరు చేసిన మంత్రి తోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# విజయవంతంగా ముగిసిన స్కిల్ ఇంటర్నేషనల్ కెరీర్ పై అవగాహన సదస్సు



**కాకినాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** ఆదిత్య నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన స్కిల్ ఇంటర్నేషనల్ కెరీర్ అవగాహన సదస్సు విజయవంతంగా ముగిసింది.జర్మనీలో లభించే ఉద్యోగ అవకాశాలు వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణ వారి భవిత అభివృద్ధి ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ రక్షణ క్షేత్రంలో అనేక విషయాలపై అవగాహన జరిగింది ఈ కార్యక్రమంలో జర్నలి క్లైంట్ మిస్ విక్టోరియా స్కిల్ బి వజ్రాల లేడీస్ స్కిల్ బినేహ,ఆదిత్య నర్సింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణా రెడ్డి ఇతర బోధనా సిబ్బంది, ఎస్ డి సి వై పి ప్రేమ కుమార్ ఎంప్లాయిమెంట్ శాఖ తదితరులు పాల్గొన్నారు.

# కూచిపూడి ఎస్సైగా నాగవిశ్వనాథ్




**అవనిగడ్డ,మార్చి 19 (వార్తాప్రభ) :** కూచిపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కే. నాగ విశ్వనాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2020 బ్యాచ్.కు చెందిన విశ్వనాథ్ విజయవాడలోని భవానిపురం, సత్యనారాయణ పురం, లలో సైబర్ క్రైమ్ లో పనిచేస్తూ బదిలీపై కూచిపూడి వచ్చారు. ఇప్పటివరకు కూచిపూడి ఎస్సైగా విధులు నిర్వహించిన ఎం సుబ్రహ్మణ్యం భీమవరం రైల్వే ఎస్సైగా బదిలీ అయ్యారు.

# పేదలకు భోజనం అందించడం అభినందనీయం

- బిజెపి పట్టణాధ్యక్షుడు ఆర్కె




**గుడివాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** ఆకలితో ఉన్న అనార్థలకు ఆహారం అందజేసే మానవత్వాన్ని చాటిన గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్ సభ్యుడు కుంభం అయ్యప్ప తన తల్లి కుంభం బేబినాంచారమ్మ జ్ఞాపకార్థం భోజనం అందజేయడం అభినందనీయమాని బిజెపి పట్టణాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌రోడ్‌లో కుంభం బేబి నాంచారమ్మ వర్ధంతి సందర్భంగా పేదలకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా అర్‌కె మాట్లాడుతూ సమాజమే దేవాలయంగా ప్రజలే దేవుళ్లగా భావిస్తూ మేము చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రహించి మా మిత్రుడు అయ్యప్ప అమ్మగారు బేబీ నాంచారమ్మ వర్ధంతి సందర్భంగా పేదలకు ఆహారం అందచేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, గాదె చరణ్, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

# ఘనంగా ఫాదరు గుజ్జుల మైఖేల్ గురుపట్టాభిషేకం





**గుడివాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** ప్రతి ఒక్కరూ దేవుడు చూపిన మార్గంలో పయనించి తోటి వారికి సహాయకులుగా ఉండాలని 42వ గురుపట్టాభిషేకాన్ని జరుపుకున్న ఫాదరు గుజ్జుల మైఖేల్ అన్నారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్‌కార్మెల్ (ఆర్.సి.ఎం.) దేవాలయంలో ఫాదర్ గుజ్జుల మైఖేల్ 42వ సం॥లోకి అడుగిడిన సందర్భంగా సహాయ గురువు అందుగుల శ్రీకాంత్, సిపియార్ సిస్టర్ బృదం ఘనంగా సత్కరించారు. తొలుత కౌన్సిల్ అధ్యక్షులు ఏలేటి విలియంజోషి ఆధ్వర్యంలో కౌన్సిల్ సభ్యులు, పలువురు భక్తులు ఫాదర్‌ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దివ్యపూజా బలిలో ప్రసగిస్తు ఫాదర్ మాట్లాడుతూ తన జీవితం ప్రభువు సేవలో 42 సంవత్సరాలు పూర్తి అవ్వటం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. తాను గురువు అయినప్పటి నుండి ఎంతోమందిని దేవుని మార్గంలోకి తీసుకువెళ్ళటం జరిగిందన్నారు. అదేవిధంగా ఎంతోమందిని గురు విద్యార్థులుగా కూడా తీర్చిదిద్దటం జరిగిందన్నారు. దేవుని చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి, తన వలే తన పొరుగువారిని ప్రేమిస్తూ ఉన్నదానిలోనుండి కొంతైనా సహాయం చేయాలని ఆయన భక్తులకు సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు రెబ్బా బాలరాజు, వి.జీవరత్నం, ఇంటి స్వామిదాసు, ఉపదేశకులు దార సబాస్టీన్, కీస్తురాజు, భాస్కర్, ఆంతోని, స్వామిదాసు, మరియదళ సభ్యులు, దీక్షా సభ్యులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఐఏఎస్ ఆగడాలకు ఉప సభాపతి ఊతం...

● టీడీపీ నాయకుడు, సామాజిక వేత్త నాగేంద్రరావు ఆరోపణ





**గుడ్లవల్లెరు,మార్చి 19 (వార్తాప్రభ) :** విన్నకోటకు చెందిన మాజీ ఐఏఎస్ పీవీ రమేష్ ఆగడాలకు అసెంబ్లీ ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు ఊతం ఇస్తున్నారని విన్నకోట టీడీపీ నాయకుడు, సామాజిక వేత్త గాలంకి నాగేంద్రరావు ఆరోపించారు. విన్నకోటలో జరుగుతున్న 127ఎకరాల చేపల చెరువులకు సంబంధించిన సర్వేను వెంటనే నిలిపి వేయాలంటూ ఆయన బుధవారం తహసీల్దార్ బి.లోకరాజును కలిసి మాట్లాడారు. కేవలం తన పొలం 50సెంట్లను ఆక్రమించుకునేందుకే మాజీ ఐఏఎస్ రమేష్ ఈ సర్వేను చేయి స్తున్నారన్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణ ద్వారా జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులను ఆదేశించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని నాగేంద్రరావు ఆరోపించారు. ఇలాంటివి ఏమీ పీవీ రమేష్‌కు కొత్తేమీ కాదన్నారు. కొద్ది నెలల క్రితం కూడా వెబ్‌ల్యాండ్‌లో లేనటువంటి రెండున్నర ఎకరాల పొలాన్ని టీడీపీ అధికారంలోకి రాగానే పీవీ రమేష్ అక్రమంగా చేర్చారన్నారు. ఆయనకు లేని పొలం చేర్చుకున్నా...తనకు సంబంధం లేదన్నారు. కాని తన పొలం 50సెంట్లను వెబ్‌ల్యాండ్‌లో అప్పట్లో పీవీ రమేష్ చెబితే...అధికారులు తొలగించటం అన్యాయమని వాపోయారు. తన పొలానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్‌ను అధికారులకు సమర్పించానని తెలిపారు. కాని వెబ్‌ల్యాండ్‌లో తన పొలాన్ని చేరనివ్వకుండా పీవీ రమేష్ తన అధికార బలంతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తన పొలాన్ని చెరువులో కలిపేసుకునేందుకే పీవీ రమేష్ తన పొలాన్ని వెబ్‌ల్యాండ్‌లో మాయం చేయించారన్నారు. ఇపుడు ఆ పొలాన్ని తన చేపల చెరువులో కలుపుకునేందుకు రఘురామకృష్ణంరాజు ద్వారా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దీనితో అధికారులు తన వినతిని పక్కన పెట్టేసి...బడాబాబులకు కొమ్ము కాసి సర్వే చేయిస్తున్నారని ఆరోపించారు. తన పొలాన్ని వెబ్‌ల్యాండ్‌లో చేర్చాకే....ఆ సర్వేను నిర్వహించాలన్నారు. లేనిచో పీవీ రమేష్ తన అధికార బలంతో తన పొలాన్ని కబ్జా చేస్తారని ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ బి.లోకరాజును వివరణ కోరగా పెండింగ్‌లో ఉన్న రైతుల అర్జీలను పరిష్కరించడంలో భాగంగానే ఈ సర్వే చేయిస్తున్నామన్నారు. గాలంకి నాగేంద్రరావుకు ఉన్న 50సెంట్ల పొలానికి సంబంధించిన ఫైల్‌ను కూడా బుధవారమే జిల్లా కలెక్టర్‌కు పంపించామన్నారు. ఆయన ఆస్తికి కూడా ఆధారం కల్పిస్తామని చెప్పారు. ఆయనకు హక్కు వచ్చేంత వరకు మిగిలిన రైతులకు సంబంధించిన సర్వే ఆపాలంటే...అది కేవలం నిబంధనలకు విరుద్ధమేనని తేల్చి చెప్పారు.

# పిఠాపురంలో చేయూత నిత్యాన్నదానం ప్రారంభం

**పిఠాపురం,మార్చి 19 (వార్తాప్రభ) :** ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ ఆశీస్సులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో పిఠాపురం పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్య అన్నదానం కార్యక్రమం ప్రారంభిండం చాలా సంతోషం అని కౌడా చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి అన్నారు.బుధవారం పిఠాపురం పట్టణం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గర్భిణీ స్త్రీలకు, రోగి సహాయకులకు నిత్య అన్నదానం కార్యక్రమాన్ని ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలని ఎంతో మందికి అన్నం పెట్టిన ఆంధ్ర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాన్ని పిఠాపురంలో మొదలుపెట్టి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన చేయూత సంస్థ ఫౌండర్ మొండి రవికుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ఎమ్మెల్సీగా మొదటి కార్యక్రమం ఇంత మంచి కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందం ఉందని, చేయూత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అన్ని ఏంతో మందికి సహాయం అం దిస్తున్నాయి అని సంస్థకు ఏవిధమైన సహాయ,సహకారాలు కావాల్సిన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా అని తెలిపారు. ఆసుపత్రి సూపరిం డెంట్ పి.సుజాత మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాన్ని మా ఆసుపత్రి లో ఏర్పాటు చేసి ఎంతో మందికి సహాయం చేస్తున్నారని తెలియచేసారు. సహకరించిన జిల్లా వైద్య అధికారిణికి,జిల్లా కలెక్టరుకు ధన్యవాదములు తెలిపారు.వారితో పాటు వైద్య బృందం,ఆసుపత్రి



కమిటీ మెంబర్లు బొజ్జా కుమార్, వేనుం సురేష్ , పిఠాపురం పట్టణ జనసేన, తెదేపా నాయకులు అభిమానులు,వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,చేయూత స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ అలీమ్ ,సభ్యులు చింతా పవన్ కళ్యాణ్ , ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు, నాయకులకు పుర ప్రజలకు,పాత్రికేయ మిత్రులకు పిఠాపురం చేయూత బృందం నీలం దయా సాగర్, సుంకర అనిల్ ,కట్టా నాగేశ్వరరావు , సియాదుల శ్రీమాన్ నారాయణ,కాకి రాంబాబు ధన్యవాదములు తెలిపారు. ఈ చేయూత నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళాలు ఇచ్చే దాతలు 8639727476 నెంబరు కు సంప్రదించాలని కోరారు.

# సుపోషణ దివస్ లో గర్భిణీలు, బాలింతలకు జాగ్రతలు



**పెనుగంచిప్రోలు,మార్చి 19 (వార్తాప్రభ) :** చిల్లకల్లు ఐసిడిఎస్ సిడిపిఓ లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు పెనుగంచిప్రోలు మండలం లోని సు బ్బాయి గూడెం అంగన్వాడి మరియు పెనుగంచిప్రోలు 10 అంగన్వాడి కేంద్ర0లో సామాజిక వేడుకలలో భాగంగా నెలలో మొదటి మరియు మూడవ బుధ వారాల్లో సుపోషణ దివస్ గర్భిణీ నమోదైన దగ్గర నుంచి బిడ్డకు రెండు సంవత్సరాలు నిండే అంతవరకు వెయ్యిరోజుల జాగ్రత్తలు గురించి అంగన్వాడీ పరిధిలోని భర్తలు,అత్తలు, గర్భిణీలు, బాలింతలు మరియు లబ్ధిదారులకు సూపర్వైజర్ ఉషారాణి తెలియచేశారు. పెనుగంచిప్రోలు మండల పరిధిలోని కొనకంచి, ముళ్లపాడు, అన్ని గ్రామాలలో సుపోషణ్ దివస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎం.ఎస్.కె. తిరుపతమ్మ, అంగన్వాడి కేంద్రాల టీచర్స్ ఎన్.వసంత, ఝాన్సి, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

# జి.కొండూరులో మందుబాబుల వీరంగం

● తాగిన మైకంలో సీసాలు పగలగొట్టి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న వైనం

● దాడిలో గాయపడిన బాణావతు కోటియా

● పరారీలో దాడికి పాల్పడిన వ్యక్తి



**జి.కొండూరు,మార్చి 19 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామంలోని మెరక పై ఓ వైన్ షాపు సమీపంలో మందు బాబులు వీరంగం సృష్టించారు.నలుగురు వ్యక్తులు ఆటోలో వచ్చి మధ్యాహ్నం నుంచి వైన్ షాపు సమీపంలో మందు సేవిస్తూ గొడవలు పడుతున్నారని,ఈ గొడవ చిలికి చిలికి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు వెళ్ళింది. విద్యానగరం నకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి, చెరువు మాధవరం గ్రామానికి చెందిన బాణావతు కోటియా నాయక్ ఇద్దరూ వారి వద్ద ఉన్న ఖాళీ బాటిల్లు పగలకొట్టి ఒకరిపై ఒకరు దాడి చేసుకు న్నారు.ఈ దాడిలో కోటియా నాయక్ పొట్టపై, కుడి చేతి పై గాయాల య్యాయి.ప్రసాద్ కు కూడా గాయాలయ్యాయని అయితే అతను తనతో వచ్చిన స్నేహితులతో కలిసి ఆటోలో పరారైనట్లు స్థానికులు చెబుతు న్నారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ గాయాలైన కోటియాను 108 అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న ప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# శిథిల భవనాన్ని తొలగించాలి.. సిపిఎం శ్రేణులు



**గుడివాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని రెండవ నంబరు బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరి 10 సంవత్సరాలు దాటినప్పటికీ దానిని పట్టించుకోకుండా వదలి వేయడంతో అది పాములకు, కుక్కలకు ఆవాసంగా మారింది.. అలాగే చుట్టుపక్కల వారు చెత్తను పడవేయటంతో కుళ్ళి దుర్గం ధం వస్తున్నది. దీనికి తోడు అసాంఘిక శక్తులు చేరి అల్లరి చేయ టం జరుగుతుంది. అక్కడ వీధిలైటు కూడా లేకపోవడంతో సాయ ంత్రం అయితే ఆ బజార్లో నడవటానికి ప్రజలు భయపడుతు న్నారని, కనుక వెంటనే శిథిల భవనాన్ని తొలగించి ప్రజోపయో గకరంగా ఏదో ఒక నిర్మాణాన్ని చేపట్టాలని సిపిఎం నాయకులు పి రజిని, ఎల్ సురేంద్ర, స్థానికులు పి శ్రీనివాసరావు తదితరులు సచివాలయంలో అడ్మిన్ జె అనిల్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అడ్మిన్ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.

# శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం హుండీల లెక్కింపు - ఈ.ఓ. వాసు



**గుడివాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** బుధవారం ఉదయం కృష్ణాజిల్లా గుడివాడలో బంటుమిల్లి రోడ్ లో ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఈరోజు హుండీలు 12 నెలలకు గాను లెక్కించగా రు. 3,67,857/- ఆదాయం వచ్చినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) తెలియజేసారు. ఈ లెక్కింపు కార్యక్ర మంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సుధాకర్, చైర్మన్ తుమ్మనపల్లి పరీష్, ఒంద్రపుడి ఈవో పీవీను ప్రసాద్ గార్లు అలాగే అర్చక స్వాములు, సాంప్రదాయ దుస్తులు ధరించిన భక్త బృందం సేవకులు అందరూ పాల్గొన్నారన్నారు. అయితే గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం 45,000 రూపాయల ఆదాయం పెరిగిందని ఈవో యార్లగడ్డ వాసు తెలిపారు.

# 30న బి.సి.చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయం ప్రారంభం

-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు రావులకొల్లు



**గుడివాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** ఈనెల 30న జరుగనున్న ఆం.ప్ర. బి.సి. చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్ర మం విజయవంతం చేయాలనీ సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావు లకొల్లు మల్లేశ్వరరావు పిలుపుని చ్చారు. బుధవారం ఆయన గుడివా డలో మీడియాతో మాట్లాడుతూ సంఘం వ్యవస్థాపకులు & రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబిరాణి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేది (ఆదివారం)న ఉదయం 10 గంటలకు విజయవాడ -గాంధీనగర్ నందు హోటల్ ఐలాపురం స్మార్ట్ ప్రక్కన ఆంధ్రప్రదేశ్ బి.సి. చైతన్య సంక్షేమ సంఘం (రి.నెం.428-2024) రాష్ట్ర కార్యాలయం ప్రారంభోత్సవం జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి 26 జిల్లాల నుండి బి.సి. అన్నదమ్ముళ్ళు, అక్కచెల్లెళ్ళు, బి.సి. కుటుంబ సభ్యులు అందరూ వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మల్లేశ్వరరావు కోరారు.

# నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

**గుడివాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని ది. 19.03.2025వ తేది బుధవారం రోజున నేషనల్ హైవే డిపార్ట్మెంట్ వారు శాంతినగర్, నక్కల కాలువ, గుడ్‌మెన్‌పేట అండ్ ఆర్.టి.సి. కాలనీ వాటర్ ట్యాంకులకు మంచినీటిని సరఫరా చేయు పంపింగ్ మెయిన్ ఇంటర్ కనెక్షన్ పనులు చేపట్టుచున్నందున ది. 20.03.2025వ తేదీన అనగా గురువారం 3వ వార్డు నుండి 18వ వార్డు వరకు మరియు 20వ వార్డులలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగును. కావున సదరు ప్రాంతముల ప్రజలు సహకరించవలసినదిగా మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరడమైనది.

# కొనసాగుతున్న కార్మికుల నమోదు కార్యక్రమం..



**గుడివాడ,మార్చి 19 (వార్తాప్రభ) :** ఈ -శ్రమ్ పోర్టల్ లో బుధవారం అనగా ది 19.03.2025 న గుడివాడ ఆటోనగర్లో ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ నెంబర్ జి. 1560 సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో 61 మంది కార్మికులు నమోదు చేసుకున్నారు. ఈరోజు తో కలిపి మొత్తం 480 మంది కార్మికులు ఈ నాలుగు రోజులలో నమోదు చేసుకోవడం జరిగింది. ఇంకా నమోదు కార్యక్రమం కొనసాగుతుందని సిఐటియు పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ హమీద్ అలియాస్ అమీర్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్ నాయకులు బొబ్బరుపల్లి ఆంజనేయులు, ఎస్.కె మొహిద్దీన్ భాష, మహదేవ ఆదినారాయణ రాజు, బోయిన వీర్రాజు రెడ్డి, నాగరాజు అన్నమనేడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పార్థసారధి పరామర్శ



**ఆగిరిపల్లి, మార్చి 19 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి గ్రామ ప్రముఖులు, వ్యాపారావేత్త మడుపల్లి లక్ష్మీ నర్సింహమూర్తి దశ దినకర్మ సందర్భంగా మన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు శ్రీ కొలుసు పార్ధసారధి వారి కుటుంబ సభ్యులును కలిసి పరమరిసించడం జరిగింది. ఈ కార్యక్రమం లో తెలుగు దేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# చెప్పేవి మాత్రమే శీరంగనీతులా! రామ రామ! కృష్ణ కృష్ణ!



**విస్సన్నపేట,మార్చి 19 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో గతంలో విస్సన్నపేటలో 3 పుట్రాల గ్రామంలో ఒకటి మందు షాపులకు గతంలో లైసెన్స్ ఇచ్చి ఉన్నారు. వాటికి ప్రస్తుతం మెయింటెన్సు చార్జీలకు కూడా రావడం లేదని సర్వత్ర వినిపిస్తుంది. అదే సమయంలో గౌడ సామాజిక వర్గానికి సంబంధించి విస్సన్నపేటలో అదనంగా మరి ఒక షాప్ ఇచ్చేందుకు డ్రా తీయగా అదనంగా పంచమ షాపుగా వేరొకటి చేరింది. వివరాలలోకి వెళితే బడికి గుడికి దగ్గరలో బ్రాందీ షాపులు ఇచ్చేందుకు అనుమతులు లేవని అదేవిధంగా హైవే రహదారులకు పక్కన కూడా అనుమతులు ఉండవని గతంలో ఉన్న చల్లాస్థాయి అధికారులు పలుమార్లు విసన్నపేట వచ్చినప్పుడు చెప్పడం జరిగింది. సంబంధిత స్థానిక అధికారులు ప్రస్తుతం నిబంధనకు నీళ్లు వదిలినట్లు అనిపిస్తుంది. ఏ కొండూరు రోడ్డులో ఎంఎన్ కె రోడ్డు నందు గతంలో ఒక షాపు ప్రస్తుతం మరొక షాపు అనుమతులు ఇవ్వడం పట్ల అందులో 35 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థలు పక్కనే మద్యం షాపు నడుపుకునేందుకు లైసెన్సు ఇవ్వటం వీటితోపాటు మరికొన్ని అనుబంధ వ్యాపారాలు కూడా రోడ్డు పక్కనే ఉండే విధంగా పథక రచన జరుగుతున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

# ఎగ్జిబిషన్ లో క్రాస్ జాయింట్ వీల్ వల్ల ఒకరు మృతి.... మరొకరికి తీవ్ర గాయాలు..



మృతి చెందిన సాయి మణి కంఠ



గాయాల పాలైన గోపి చంద్..

**పెనుగంచిప్రోలు,మార్చి 19 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో జరుగుతున్న చిన్న తిరుణాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ నందు క్రాస్ జాయింట్ విల్ పై నుండి ఇద్దరు వ్యక్తులు పడి ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. సేకరించిన వివరాలు ప్రకారం వత్సవాయి మండలం, కొత్త వేమవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తిరుణాల్లో సరదాగా గడిపేందుకు వచ్చి ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన క్రాస్ జైంట్ విల్ ను ఎక్కారు. జెయింట్ వీల్ తిరుగుతుండగా దానికున్న తొట్టి పక్కకు వరగడంతో అందులో ఉన్న కొత్త వేమవరం గ్రామానికి చెందిన గింజుపల్లి సాయి మణికంఠ,(30) గింజుపల్లి గోపీచంద్ పక్కనే ఉన్న సిసి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలు అయ్యాయి. మణికంఠ ప్రమాద స్థలంలోనే మృతి చెందగా గోపీచంద్ కుడి చెయ్యి, కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు,

**మానవత్వం మరిచిన ఎగ్జిబిషన్ నిర్వాహకులు..** ఒక వ్యక్తి మృతి చెంది, మరొకరికి తీవ్ర గాయాలైన కనీసం కనికరం లేకుండా ఎగ్జిబిషన్ కొనసాగించటంపై స్థానికులు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరు ఇద్దరు ఒకే కుటుంబం కు చెందిన వారు. పోలీసులు జెవింత్ విల్ తోపాటు వినోదం కోసం ఏర్పాటు చేసిన అన్నిటిని ఆపివేశారు.

# కాంగ్రెస్ నేత జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్,బి. సి.శ్రేణుల సంబరాలు





**హైదరాబాద్,మార్చి 19 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బి.సి. బిల్లు పాస్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కి, కాంగ్రెస్ యువ నాయకుడు పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ కి శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ నాయకులు కాంగ్రెస్ శ్రేణులు పండగ వాతావరణాన్ని కల్పించారు. కాంగ్రెస్ అగ్ర నాయకుల పాలాభిషేకంలో బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బృందం పాల్గొన్నారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో చందానగర్, శేరి లింగంపల్లి, చందానగర్ లలో రాహుల్ గాంధీ కి, రేవంత్ రెడ్డి కి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పలువురు బిసి నాయకులు 42 శాతం రిజర్వేషన్ మరియు ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగునట్లు వర్గీకరణ రెండు బిల్లులు అసెంబ్లీలో పాస్ చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి రాహుల్ గాంధీకి, రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రసంగించారు. బిసి ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ గురించి అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపడమే కాకుండా, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ బీసీలకు అమలు పరుస్తామని రేవంత్ రెడ్డి నిండు సభ అసెంబ్లీలో ప్రకటించడం విశేషమన్నారు. అందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వానికి రాహుల్ గాంధీ కి, రేవంత్ రెడ్డి కి మరి యు కాంగ్రెస్ శ్రేణుల అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ అభినందన సభలో మాట్లాడడం జరిగింది. రాబోవు స్థానిక సంస్థల, గ్రామపంచాయతీ నుండి హైదరాబాద్ పట్టణం జిహెచ్ఎంసి వరకు కూడా 42 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలని సభలో కోరడం జరిగింది. ఎస్సీల వర్గీకరణ బిల్లు మరియు బీసీల జనగణన తెలంగాణా రాష్ట్రం లో ఒక కొత్త అధ్యాయం. అందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ కార్యక్రమం చేసిన శేర్లింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ కి, రఘునందన రెడ్డి కి అభివందనాలు తెలియజేశారు. ఇకముందు కూడా కాంగ్రెస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వం పేదరిక నిర్మూలన మరియు బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో న్యాయం జరిగే విధంగా చూడాలని భేరి కోరటం జరిగింది. బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న తన సందేశంలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు పరిచే విధంగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ అసెంబ్లీకి, స్పీకర్ గారికి కాంగ్రెస్ శ్రేణులు అందరికీ ధన్యవాదాలు అభివందనములు తెలియజేయడం జరిగింది. ఎస్సీల వర్గీకరణ బీసీల కులగణన 42 శాతం రిజర్వేషన్ ఇది చారిత్రక ఘట్టం అంబేద్కర్ ఆధ్వర్యంలో వచ్చిన రాజ్యాంగం ప్రకారం కొంతవరకు ఎస్సీలకు ఎస్టీలకు న్యాయం జరిగిన పేదలైన బీసీలకు న్యాయం జరగలేదు. ఈ రిజర్వేషన్ తో కొంతవరకైనా రాజకీయ రంగంలో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని తెలియజేయడం జరిగింది. అనేకమంది కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకులు కార్పొరేటర్లు మరియు ఎందరో ప్రసంగించి రేవంత్ రెడ్డి కి రాహుల్ గాంధీ కి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి కి , మైనార్టీ నాయకుడైన షబ్బీర్ అలీ కి కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ కి మరియు పెద్దలకు పాలాభిషేకం చేసి సభను ఉద్దేశించి ప్రసంగించడం జరిగింది. ఈరోజు బీసీలకు ఎస్సీలకు పండుగ రోజు అని సంతోషం వ్యక్తపరుస్తూ రేవంత్ రెడ్డి కి, మరియు రాహుల్ గాంధీ కి కాంగ్రెస్ హై హాయ్ కమాండ్స్ ఇచ్చిన మాట ప్రకారం జనగణన బీసీ రిజర్వేషన్ 42 శాతం ఎస్సీల వర్గీకరణ చేసినందుకు అభివందనములు తెలియజేశారు ఇకముందు కూడా కాంగ్రెస్ శ్రేణులు అందరు తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చినందున మనం ప్రచారం చేసుకోలేకపోయామని, బీసీలకు రిజర్వేషన్ కాకుండా మహిళలకు ధనవంతులు చేసే కార్యక్రమం ఆరు గ్యారంటీలు మరియు అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదల గురించి చేస్తున్నామని ఇది కార్యకర్తలు ముఖ్యంగా నాయకులు అందరూ ఇంటింటికి గల్లి గల్లి తిరిగి అన్ని పది డివిజన్లలో ప్రచారం చేయాలని, మనం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు మంచి పనులు అభివృద్ధి పథంగా తెలంగాణను ముందుకు తీసుకెళుతున్న కార్యక్రమాలు అన్నిటిని కింది సాయి వరకు ఇంటింటికి ప్రచారం చేయాలని కోరడం జరిగింది ఈ పాలాభిషేకం కార్యక్రమంలో రఘు నందన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, అశోక్ గౌడ్, మోహన్ గౌడ్, సురేష్ గౌడ్, యాదయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, రాజేష్ యాదవ్, కిట్టు యాదవ్, నరసింహ గౌడ్, ముఖ్యంగా జగదీశ్వర్ గౌడ్ తో పాటు రఘునందన్ రెడ్డి నరసింహ యాదవ్ హైటెక్ సిటీ కృష్ణ యాదవ్ గౌడ్ బీసీ అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు సాయన్న ముదిరాజ్ మహిళలు, పెద్దలు ,కాంగ్రెస్ శ్రేణులు అనేకమంది పాల్గొని చందానగర్ లో జరిగిన అంబేద్కర్ విగ్రహం సాక్షిగా ఈ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది.

# ఎస్సీ మహిళా సర్పంచ్ నని నాపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు

● మైలవరం గ్రామ సర్పంచ్ మంజు భార్గవి మనోవేదన



**మైలవరం,మార్చి 19 (వార్తాప్రభ) :** ఎస్సీ మహిళా సర్పంచ్ నని నాపై కొందరు వార్డు సభ్యులు పదే పదే దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా,మైలవరం గ్రామ సర్పంచ్ గరికపాటి మంజు భార్గవి తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మైలవరం గ్రామ అభివృద్ధికి పాటుపడుతుంటే కొంతమంది వార్డు సభ్యులు తనపై కొందరు వార్డు సభ్యులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈనెల 17వ తేదీ పంచాయతీ కార్యాలయంలో జరిగిన పాలకవర్గ సభ్యుల సమావేశంలో గ్రామ అభివృద్ధి, ప్రణాళికలపై చర్చించామని, సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పడం జరిగిందన్నా రు. అదేరోజు మధ్యాహ్నం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ను కలవాల్సి ఉండగా ఒకటిన్నరకు సమావేశం ముగించి సభ్యుల అనుమతితో కార్యాలయం నుంచి వెళ్లడం జరిగిందన్నారు. వార్డు సభ్యులలో ఒకరు (చిట్టిబాబు) సమావేశం నుంచి సర్పంచ్ సమావేశం మధ్యలో అర్ధాంతరంగా వెళ్లిపోయినట్టు సామాజిక మాధ్యమాల ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరిగితే వార్డు సభ్యునిగా ప్రశ్నించడంలో తప్పు లేదని,కాని దానికి విరుద్ధం గా పంచాయతీ కార్యాలయంలో జరిగిన విషయా లను సామాజిక మాధ్యమాల ద్వారా రచ్చ చేయడం ఎంతవరకు సబబు అని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా పాలకవర్గం సహకారం తో గ్రామ అభివృద్ధికి కృషి చేశానన్నారు. పంచాయతీలో అవినీతి జరిగిందని ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు, సభ్యులందరి అనుమతితోనే జరిగాయన్నారు. పాలకవర్గం ఆమోదం కోసం పెట్టిన తీర్మానాలలో సంతకం పెట్టి ఇప్పుడు అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాడని పేర్కొన్నారు. కొన్ని విషయాలలో అతనికి సహకరించకపోవడం వల్లనే నాపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బీటెక్ చదివి కూడా రాజకీయాలపై ఆసక్తితో చేస్తున్న ఉద్యోగాన్ని సైతం వదిలి ప్రజాసేవకు అంకితమయ్యానని ఆమె వెల్లడించారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లతో తాను సర్పంచ్ అయ్యానని,ఎస్సీ మహిళలనే చిన్న చూపుతో తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఆ వార్డు సభ్యుడు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి పేదలకు ఇచ్చిన జగనన్న లేఅవుట్ లోని పట్టాలను అమ్ముకున్నాడని సర్పంచ్ ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వాళ్ళ వద్ద నుంచి రూ. 25 లక్షలు ఇప్పించాలని తనను పదేపదే ఇబ్బంది పెడుతున్నాడని లేదంటే గతం లో మైలవరం సర్పంచ్ గా పనిచేసిన హేమలత కు పట్టిన గతే నీకు పడుతుందని అనేకసార్లు హేళనగా మాట్లాడినట్లు తెలిపారు. గతంలో పాలకవర్గ సమావేశంలో ఇదే వ్యక్తి దుర్గ ప్రవర్తిస్తూ మినిట్సుబుక్కు నాపై విసిరి కొడితే అది పక్కనున్న గుమస్తాకు తగిలి రక్త గాయం అయిందన్నారు. బుడబుక్కల వాళ్ళ లాగా, లేబర్ వాళ్ళు అని కులం పేరుతో దూషించడం జరిగిందన్నారు. అలాగే చెక్ పవర్ రద్దు చేయిస్తా అంటూ బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ మహిళా సర్పంచ్ గా ఉన్నాను కాబట్టే తనపై ఈ విధంగా దుష్ప్రచారం చేస్తున్నాడని నా స్థానంలో మరొకరు ఉంటే ఈ విధంగా మాట్లాడే వాళ్ళా అని ఆమె ప్రశ్నించారు. నాపై పదే పదే దురుసుగా ప్రవర్తిస్తూ అసత్య ఆరోపణలు చేస్తున్న వార్డు సభ్యుడు చిట్టిబాబుపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింద న్నారు.

# వైసీపీ కార్యకర్తల అక్రమ అరెస్టు అన్యాయం..

● న్యాయం చేకూర్చాలని పోలీస్ డీసీపీ మహేష్ రాజ్ కి వైసీపీ నాయకుల వినతి పత్రం..



**పెనుగంచిప్రోలు,మార్చి 19 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు వైసిపి కార్యకర్తల అక్రమ అరెస్టుపై సరైన న్యాయం చేకూర్చాలని పోలీసు డిజిపి మహేష్ రాజ్ కి జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ మరియు నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. పెనుగంచిప్రోలు లో బుధవారం తెల్లవారు జామున శ్రీ లక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి ఆనవాయితీ ప్రకారం పసుపు - కుంకుమలు సమర్పించుటకు అన్ని పార్టీల వారు ప్రభలు కట్టుకొని వస్తుండగా పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ కూడలి సమీపంలో టీడీపి మరియు వైసీపీ వర్గీయులు మధ్యలో ఘర్షణలు జరిగింది. పోలీసువారు ఏకపక్షంగా వైసీపీ 30 మంది కార్యకర్తల పైనే కేసులు కట్టడం బాధాకరం అని, ఈ సంఘటనపై క్షుణ్ణంగా పరిశీలించి దాడికి పాల్పడిన వారిపై కేసులు కట్టవలసిందిగా కోరుకుంటూ డిసీపీ మహేష్ రాజ్ కి జిల్లా పార్టీ అధ్యక్షులు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు వినతి పత్రం అందజేయడం జరిగింది. లేనిపక్షంలో మీరు ఏ విధంగా అయితే ఏకపక్షంగా వ్యవహరిస్తారో అదే విధంగా ప్రజల మద్దతుతో అందర్నీ కలుపుకొని పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీ సంఘాల అధ్యక్షులు మార్కపుడి గాంధీ, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరి శివాజీ, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, న్యాయవాది శివరాత్రి పృద్వి,రాష్ట్ర ఎస్సి విభాగం కార్యదర్శి కన్నమాల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బోడె



**కంకిపాడు,మార్చి 19 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడు లోని మార్కెట్ యార్డ్ నందు బుధవారం అపరాల కొనుగోలు కేంద్రాన్ని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర రాక నష్టపోకుండా ఉండటం కోసం ప్రభుత్వమే నేరుగా రైతుల వద్ద నుంచి మినుములు కొనుగోలు చేస్తుందని తెలిపారు. మినుములు క్వింటా 7400 రూపాయలు, పెసలు 8682 రూపాయల మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులు ఖాతాలోకి నేరుగా ప్రభుత్వం డబ్బులు జమ చేస్తుందని పేర్కొన్నారు. రైతులు దళారులును నమ్మకుండా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎంపీపీ ఎన్. రాజ్యలక్ష్మి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్ష



**నూజివీడు,మార్చి 19 (వార్తాప్రభ) :** నూజివీడు ఉప విద్యాశాఖ అధికారి పరిధిలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు రాసేందుకు 30 పరీక్షా కేంద్రాలను కేటాయించారు. బుధవారం జరిగిన హిందీ పరీక్షలో ఈ పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5, 397 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు హాజరు కావలసి ఉండగా, 5, 293 మంది హాజరైనట్లు నూజివీడు ఉప విద్యాశాఖ అధికారి సేవ్యా నాయక్ తెలిపారు. గొల్లపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ పరీక్షా కేంద్రంలో గరిష్టంగా 18 మంది గైర్హాజరు కాగా నూజివీడు సెయింట్ మేరీస్ పాఠశాలలో కనిష్టంగా ఒకరు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా డివైఈవో సేవ్యా నాయక్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు త్రాగునీటి కొరత లేకుండా అన్న ఏర్పాట్లు చేసామన్నారు.

# ప్రసూతి ఆసుపత్రిలో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ యంత్రం ప్రారంభం



**తిరుపతి,మార్చి 19 (వార్తాప్రభ) :** ఎస్వీ వైద్య కళాశాల,ప్రసూతి ఆసుపత్రిలో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ యంత్రాన్ని డాక్టర్ డి. ఎస్. వి. ఎల్. నరసింహం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డి. ఎస్. వి. ఎల్. నరసింహం మాట్లాడుతూ మెమోగ్రామ్ యంత్రమును అనగా (రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరికరమ), మహిళా రోగులకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ చేయడానికి ఉపయోగపడే పరికరాన్ని బుధవారము ఆయన చేతులు మీదగా ప్రారంభించి ఉపయోగంలోకి తీసుకురావడం జరిగింది. ఈ పరికరము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయడానికి, పేద మహిళ రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అని ఆయన తెలిపారు. బుధవారము ప్రసూతి ఆసుపత్రిలో ప్రతి ఒక్క మహిళ ఈ యొక్క పరీక్షలు చేసుకుని క్యాన్సర్ బారిన పడకుండా వారి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. తదుపరి రుయా ఆసుపత్రిని సందర్శించి, కొత్తగా నిర్మిస్తున్న నిర్మాణాలు వాటిలో లోపాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా యూజీ లెక్చరర్ గ్యాలరీస్ ని, పీజీ హాస్టల్ నిర్మాణాన్ని కి కేటాయించిన బడ్జెట్ నుండి, ఎస్ వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్, మరియు, రుయా ఆస్పత్రి సూపరిటెండెంట్ సమన్వయముతో మొదట ప్రాధాన్యతతో నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిప్యూటీ ఈవో రమణకు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల అధిపతులతో విభాగాల లోని లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. త్వరలో అన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్, పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు, మరియు ప్రొఫెసర్ పోస్టు ప్రమోషన్లు పూర్తి చేస్తామని, ప్రతిపాదనలన్నీ కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ జి.రవి ప్రభు, మాజీ రుయా సూపర్నెట్ డాక్టర్ భారతి, డాక్టర్ రుయా ఆసుపత్రి ఇంచార్జ్ సూపరిటెండెంట్ డాక్టర్ మధుసూదన్, ప్రసూతి వైద్యశాల సూపరిటెండెంట్ డాక్టర్ పార్థసారధి రెడ్డి, డాక్టర్ ప్రమీల , ప్రసూతి వైద్యశాల సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డాక్టర్ ఆర్ ఆర్ రెడ్డి, రుయా ఆస్పత్రి అడ్మిన్ ఆఫీసర్ కనక నరసారెడ్డి, డాక్టర్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఎస్ ఎన్ మూర్తి, రుయా ఆసుపత్రి సిబ్బంది, ప్రసూతి ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, ఫార్మసీ ఆఫీసర్ శశి, మరియు ఎస్ వి వైద్య కళాశాల పి ఆర్ ఓ. వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కలిగించాలి

**కిర్లంపూడి,మార్చి 19 (వార్తాప్రభ) :** ఫోక్సో చట్టంపై యుక్త వయసులో ఉన్న బాలికలకు అవగాహన కలిగించవలసిన అవసరం ఎంతైనా ఉందని పడాల చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్,కె.శ్రీనివాస్, డి ఆర్ డి ఎ,హ్యూమన్ డెవలప్మెంట్ రిసోర్స్ పర్సన్ యాంకర్ ,జి అనిల్ కుమార్ లు అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి మండల మహిళా సమైక్య కార్యాలయంలో విఓ నాయకులకు,విఓఏలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం, శరకణం వేద కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ,వ్యక్తిగత విద్య,ఇది నా తప్పు కాదు,వ్యక్తిగత భద్రతా నియమాలు, ఇంటర్నెట్ సేఫ్టీ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడమే కాకుండా, గ్రామ స్థాయిలో తమ పరిధిలో ఉన్న బాలికలకు ఫోక్సో చట్టంపై అవగాహన కలిగించాలని వి ఓ, నాయకులను,విఓఏ లను వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీసీలు, బుల్లియ్య,సత్య ప్రసాద్, లోవరాజు,శాంత, సంధ్య,అధిక సంఖ్యలో విఓ నాయకులు, వి ఓ ఏ లు పాల్గొన్నారు.

# కుక్క దాడిలో చిన్నారి గాయాలు..



**పెనుగంచిప్రోలు, మార్చి 19 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు పట్టణంలో రెండు సంవత్సరాల చిన్నారి పై కుక్క దాడి చేశాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన చిన్నారిపై కుక్క దాడుల చేస్తున్నది గమనించి కుక్కలను అల్లిచ్చిన స్థానికులు. అప్పటికే చిన్నారిని తీవ్రంగా గాయపరచిన కుక్కలు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి చికిత్స అందించిన కుటుంబ సభ్యులు, అత్యవసర వైద్యం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్కలు దాడిలో చిన్న పిల్లలకు గాయాలు అవ్వడం తో స్థానిక తల్లి దండ్రు లు భయందోళ్లనకు గురువుతున్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188